ప్రజాశక్తి

గురువారం 11 డిసెంబర్ 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

కసాయి కొడుక్కి.. జీవిత ఖైదు

- తల్లిదండ్రులను అత్యంత క్రూరంగా హత్య చేసిన నిందితుడు
- నేరం జరిగిన సంవత్సరం లోపే కోర్టు తీర్పు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అప్పికట్ల గ్రామంలో 2024 సంవత్సరం డిసెంబర్ 14న పాగోలు కిరణ్ చంద్ర తన తల్లిదండ్రులను అత్యంత క్రూరంగా హత్య చేశాడు. ఈ కేసులో నిందితుడికి కోర్టు బుధవారం నాడు జీవిత ఖైదు విధిస్తూ.. తీర్పు చెప్పింది.

నేరస్థులకు న్యాయస్థానంలో శిక్ష పడినప్పుడే బాధితులకు నిజమైన న్యాయం జరిగినట్లు అవుతుందని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అప్పికట్ల గ్రామానికి చెందిన నిందితుడు పాగోలు కిరణ్‌చంద్రకు వివాహం అయ్యి.. చీరాలలోని పోస్టాఫీసులో పనిచేస్తూ జీవనం సాగించేవాడు. నిందితుడికి ఒక అక్క ఉంది. నిందితుడి తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పని చేసి రిటైర్ అయ్యి.. పెన్షన్ పొందుతున్నాడు. పెన్షన్ వచ్చిన ప్రతిసారీ నిందితుడు డబ్బులు ఇవ్వాలని గొడవ పెట్టేవాడు. తల్లిదండ్రుల ఆస్తిని తనకు రాయక, తన అక్కకు లేదా ఆమె పిల్లలకు రాసేస్తారేమో అన్న అనుమానంతో తరచూ గొడవలు చేసి, 'ఇవ్వకపోతే చంపేస్తా..' అని బెదిరించేవాడు.

ఈ నేపథ్యంలో 2024 డిసెంబర్ 14 న అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో నిందితుడు కిరణ్ చంద్ర తన తల్లిదండ్రులు పాగోలు విజయ భాస్కర్ (74), పాగోలు వెంకట సాయి కుమారి (71)ను ఆస్తిని తన పేరున రాయమని అడిగినప్పుడు, వారు తదనంతరం రాసిస్తామని చెప్పడంతో ఆవేశానికి లోనై, రోకలి బండతో విచక్షణారహితంగా కొట్టి హత్య చేశాడు. అనంతరం అక్కడి నుండి పారిపోయాడు. మృతుల కుమార్తె మునిపల్లి లోకకల్యాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాపట్ల రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఎం. శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుత బాపట్ల రూరల్ సర్కిల్ సీఐ బి.హరికృష్ణ కేసు దర్యాప్తు ప్రారంభించి, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తరువాత బాధ్యతలు స్వీకరించిన సీఐ కొండవీటి శ్రీనివాసరావు భౌతిక సాక్ష్యాధారాల నిపుణుల నివేదికను సేకరించి కేసు దర్యాప్తు పూర్తి చేసి నిందితుడిపై ఛార్జిషీట్ ▶ 2లో

ధాన్యం కొనుగోలుకు కసరత్తు..



- 94,768 మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా
- 201 సేవా కేంద్రాలు ఏర్పాటు
- గ్రేడ్-1 క్వింటాలు రూ.2,389గా నిర్ణయం
- సాధారణ రకానికి రూ.2369
- మార్చి 31 వరకు కొనసాగనున్న కొనుగోళ్లు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో 94,768 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. జిల్లాలో 201 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు సమాయత్తమయ్యారు. సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశాల మేరకు పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 169 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్ మిల్లర్లు కొనుగోలు చేశారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళు, ఇతర సదుపాయాలపై ప్రత్యేక కథనం..

జిల్లాలో 2025 - 26వ సంవత్సరం ఖరీఫ్‌లో ప్రకాశం జిల్లాలో రైతులు 38,036 ఎకరాలలో వరి పంటను సాగు చేశారు. 94,768 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇప్పటివరకు 169.520 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 20 మంది రైతుల వద్ద నుండి సేకరించి నాలుగు రైస్ మిల్లులకు కొనుగోలు కేంద్ర సిబ్బంది రవాణా చేశారు. 2025- 26 సంవత్సరానికి ధాన్యం గ్రేడ్-1 క్వింటాల్‌కు రూ.2389, సాధారణ రకానికి రూ.2369 కనీస మద్దతు ధర నిర్ణయించారు. ధాన్యాన్ని రైతుల వద్ద నుండి సేకరించుటకు 201 రైతు సేవా కేంద్రాలను అనుసంధానం చేస్తూ 45 క్లస్టర్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రామ వ్యవసాయ సహాయకులకు రైతులు బహిరంగ మార్కెట్లో విక్రయించిన ధాన్యం వివరాలు ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ లో నమోదు చేయాల్సి ఉంది.

హాయ్ అని మెసేజ్ పెడితే...

రైతులు 7337359375 వాట్సాప్ నెంబర్ కు హాయ్ అనే సందేశం పంపి నేరుగా ధాన్యం కొనుగోలు ప్రక్రియకు ▶ 2లో

క్వారీయింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు

త్వరలో గ్రానైట్ వ్యర్థాల డంపింగ్ స్థలం గుర్తింపు

కలెక్టర్ రాజాబాబు

▶ 5లో

శింగరాయకొండలో పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఐజి త్రిపాఠి

నేరాల నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ

▶ 8లో

'నామ్' రహదారి విస్తరణ పనుల్లో కీలక ముందడుగు..

- భూసేకరణ నిధుల చెల్లింపునకు ప్రభుత్వ ఉత్తర్వులు

ప్రజాశక్తి-అద్దంకి

నార్కెట్‌పల్లి-అద్దంకి- మేదరమెట్ల (నామ్) రహదారి విస్తరణ పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. గత పదేళ్ళుగా భూసేకరణకు అవసరమైన నిధుల మంజూరులో జాప్యం కారణంగా అద్దంకి మండలంలోని చక్రాయపాలెం, గోపాలపురం గ్రామాలు.. అలాగే సంతమాగులూరు మండలం పరిధిలోని ఏల్చూరు గ్రామాల వద్ద రహదారి విస్తరణ పనులు నిలిచిపోయాయని మంత్రి వివరించారు. ఈ అంశాన్ని పలు మార్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలను కలిపే అత్యంత కీలకమైన ఈ రహదారిలో ప్రమాదకర మలుపుల కారణంగా తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వివరించామని, ప్రజల భద్రతను దష్టిలో ఉంచుకుని సీఎం చంద్రబాబు నాయుడు నామ్ రోడ్డు విస్తరణకు సంబంధించి భూసేకరణకు నిధులు కేటాయించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. అయితే ఈ మేరకు బుధవారం నాడు నామ్ రోడ్డు విస్తరణకు సంబంధించి భూసేకరణకు రూ.3.44 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. రహదారి విస్తరణ కోసం మంజూరైన నిధులను త్వరలోనే చక్రాయపాలెం, కలవకూరు, గోపాలపురం, ఏల్చూరు గ్రామాల పరిధిలో భూసేకరణ నిమిత్తం నిధులను రైతులకు చెల్లించి, రహదారి విస్తరణ పనులను వేగవంతం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ రహదారి విస్తరణ పూర్తైతే ప్రయాణికులకు మరింత సురక్షితమైన ప్రయాణం, ఈ ప్రాంతాభివద్ధికి ఊతం లభిస్తుందని మంత్రి గొట్టిపాటి వివరించారు.

మీ ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉంది.?

- ఐవిఆర్ఎస్ సర్వే చేస్తున్న టిడిపి అధినేత.!

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

'తెలుగుదేశం పార్టీ శాసనసభ్యుల పనితీరు విషయమై ప్రతి నియోజకవర్గం నుంచి నాలుగైదు మార్గాల్లో సర్వే చేయిస్తున్నా.. దీని ప్రకారం ఇంకా 37 మంది ఎమ్మెల్యేల పనితీరు మెరుగుపడాల్సి ఉంది' అని ఇటీవల పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో టిడిపి అధినేత చంద్రబాబు చెప్పడం జరిగింది. పనితీరు సక్రమంగా లేని వారిలో నూతనంగా ఎమ్మెల్యేలు ఎన్నికయిన వారు అత్యధికులు ఉన్నారని పలు సందర్భాల్లో తెలిపారు. ఈ నేపథ్యంలో గత రెండు, మూడు రోజులుగా బాపట్ల, చీరాల నియోజకవర్గాలకు చెందిన ఓటర్లకు ఐవిఆర్ఎస్ కాల్స్ వస్తున్నాయి. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే మీరు ఏ పార్టీకి ఓటు వేస్తారు.? కూటమి అభ్యర్థులకా.? లేక వైసిపి వారికా.? లేక వేరె వరికయినానా.? అని ఒక రోజు సర్వే జరిగింది. మీ నియోజకవర్గ ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉంది.? బాగుంది అనుకుంటే 1 నొక్కండి.. పర్వాలేదు అనుకుంటే 2 నొక్కండి.. బాగోలేదు అనుకుంటే 3 నొక్కండి.. అంటూ ఐవిఆర్ఎస్ సర్వే కాల్స్ వచ్చాయి. ప్రజా సంబంధాలు, పనితీరు విషయంలో నూతనంగా ఎన్నికయిన శాసనసభ్యులు కొందరు వెనుకబడి ఉన్నారని దేశం అధినేత చంద్రబాబు భావిస్తున్న నేపథ్యంలో మరో పర్యాయం బాపట్ల, చీరాల ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, మద్దులూరి మాలకొండయ్యల పనితీరు విషయమై ఈ సర్వే జరిగినట్లు భావిస్తున్నారు.

ధాన్యం కొనుగోలుకు కసరత్తు

(మొదటిపేజీ తరువాయి)

షెడ్యూల్ బుక్ చేసుకోవచ్చు. జిల్లాలో 88008901457 నెంబర్ తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ధాన్యము కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయనున్నారు. ధాన్యం కొనుగోలు ఏజెన్సీ అధికారులకు కొనుగోలు సిబ్బంది కొనుగోలు కేంద్రాల్లో అన్నివేళలా అందుబాటులో ఉండి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించనున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- జి.వరలక్ష్మి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

ధాన్యం కొనుగోళ్ళల్లో దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు. ప్రభుత్వం ధాన్యం మొదటి రకం, సాధారణ రకాలకు కనీస మద్దతు ధర నిర్ణయించింది. బహిరంగ మార్కెట్‌లో ధాన్యానికి కనీస మద్దతు ధర కంటే ఎక్కువ ధర లభిస్తే రైతులు అమ్ముకోవచ్చు. మద్దతు ధర కంటే తక్కువ ధర లభిస్తే రైతులు వారు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించాలి. రైతులకు అవసరమైన గోనె సంచులు అందుబాటులో ఉన్నాయి. జిల్లా పౌర సరఫరాల శాఖ వద్ద 1.30 లక్షలు, రైస్ మిల్లర్ల వద్ద 1.20 లక్షల గోనె సంచులు అందుబాటులో ఉన్నాయి. రైతు సేవా కేంద్రాలలో కనీస మద్దతు ధర, నాణ్యతా ప్రమాణాలు, గోనె సంచులు, రవాణా సౌకర్యాం, హమాలీ ఛార్జీలు వంటివి పోస్టర్లు, ఫ్లెక్సీల రూపంలో ప్రదర్శించాం. ఆయా రైతు సేవా కేంద్రాలలో రైతుల సమావేశం ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలుపై అవగాహన అవగాహన కల్పిస్తున్నాం.

కసాయి కొడుక్కి.. జీవితఖైదు

(మొదటిపేజీ తరువాయి)

దాఖలు చేశారు.

ఈ కేసు కోర్టులో విచారణకు రాగా బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు పర్యవేక్షణలో రూరల్ సీఐ కొండవీటి శ్రీనివాసరావు, ఎస్ఐ ఎం. శ్రీనివాసులు, కోర్ట్ లైజనింగ్ హెడ్ కానిస్టేబుల్ ఈశ్వరరావు, రూరల్ కోర్టు హెడ్ కానిస్టేబుల్ జి.శివయ్య సాక్షులు సరైన రీతిలో నిర్భయంగా సాక్ష్యం చెప్పేలా చూసి.. కోర్టుకు సమయాకి హాజరుపరిచారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.శ్రీనివాసరావు బలమైన వాదనలు వినిపించి నిందితుడి నేరాన్ని తగిన సాక్ష్యాధారాలతో నిరూపించారు. బాపట్ల అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కె. శ్యామ్ బాబు నిందితుడు కిరణ్‌చంద్రకు జీవిత ఖైదుతో పాటు రూ.పది వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు ఇచ్చారు. నేరం జరిగిన సంవత్సరం లోపే నిందితుడికి శిక్ష పడేలా కషి చేసిన రూరల్ సీఐ కొండవీటి శ్రీనివాసరావు, ఎస్ఐ ఎం.శ్రీనివాసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. శ్రీనివాసరావుని, కోర్టు లైజనింగ్ సిబ్బంది, కోర్టు హెడ్ కానిస్టేబుల్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు.

అమలు కాని లోకేష్ హామీ

నిరాశలో 98 డిఎస్‌సి క్వాలిఫైడ్ అభ్యర్థులు

ప్రజాశక్తి-పొదిలి

1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల్లో ఎంపికైన వారికి గత ప్రభుత్వం కొంతమందికి ఉద్యోగాలు ఇవ్వగా మిగిలిన వారు నిరాశ చెందారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. గత వైసిపి ప్రభుత్వంలో కేవలం అగ్రవర్ణాల అభ్యర్థులకు మాత్రమే ఉద్యోగాలు దక్కాయి. అయితే అప్పట్లో ఈ విషయంపై పెద్దఎత్తున దుమారం రేగింది. తాము అధికారులకు వచ్చిన వెంటనే 98 డీఎస్సీ అభ్యర్థుల సమస్య పరిష్కరిస్తామని ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పొదిలి పాదయాత్ర సందర్భంగా హామీ ఇచ్చారు. మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా 1,500 మంది అభ్యర్థులు మాత్రమే ఉండగా ప్రకాశం జిల్లాలో సుమారు 400 మంది ఉన్నారు. వైసిపి ప్రభుత్వం కొంతమందికి ఇచ్చి మిగిలిన వారికి అన్యాయం చేసిందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ సందర్భంగా మిగిలిపోయిన నిరుద్యోగులు అందరూ దళిత పేద మధ్యతరగతికి చెందినవారు. కోటి ఆశలతో కూటమి ప్రభుత్వానికి ఓటు వేస్తే తమ జీవితాలు చివరి దశలో అయినా మారుతాయని ఆశించిన మిగిలిన నిరుద్యోగులకు నేటికీ ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంతో వారు తీవ్ర కలత చెందుతున్నారు. ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంగా పొదిలికి వచ్చిన ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని స్థానిక 98 డీఎస్సీ అభ్యర్థులు కోరుతున్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

బాల్య వివాహాల నిర్మూలన కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు అందరూ సమిష్టిగా కృషి చేయాలని ప్రాజెక్టు డైరెక్టర్ సువర్ణ పిలుపునిచ్చారు. బుధవారం యర్రగొండపాలెం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో నిర్వహించిన యర్రగొండపాలెం ప్రాజెక్టు అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా ప్రతి కార్యకర్తా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సకాలంలో పంపిణీ చేయాలని ఆదేశించారు. పిల్లలు, తల్లి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అంగన్‌వాడీ అధికారి

అన్నా క్యాంటిన్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండు సమీపంలోని అన్న క్యాంటిన్‌ను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ భోజనం రుచి చూశారు. ఎంతమంది పేదలు అన్న క్యాంటిన్‌ను ఉపయోగించుకుంటున్నారో ఆరా తీశారు. పేదల ఆకలి తీర్చేందుకు ప్రవేశపెట్టిన అన్న క్యాంటిన్ నిర్వహణలో లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఇబ్రహీంఖాన్, పట్టణ ప్రధాన కార్యదర్శి రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

పొగ మంచులో రహదారి కనిపించక లైట్లు వేసుకున్న వాహనం

మంచు కురిసే వేళలో..

రహదారి కనిపించక వాహనదారుల ఇక్కట్లు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండల కేంద్రమైన సంతనూతలపాడులోని ఒంగోలు-కర్నూలు రహదారి ఉదయం వేళ పొగ మంచుతో దట్టంగా నిండిపోతోంది. దాంతో వాహనదారులు పగటి వేళలో కూడా లైట్లు వేసుకొని మరీ ప్రయాణించాల్సి వస్తోంది. ఉదయం వేళలో విస్తారంగా మంచుతో నిండి రహదారి చీకటిమయం అవుతోంది. ఒకపక్క మంచు, మరోపక్క చలితో వాహనదారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8 గంటలైనా మంచు వీడటం లేదు.

కంభంలో మానవ హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-కంభం

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మరియు మండల విద్యాశాఖాధికారి అబ్దుల్ సత్తార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో అబ్దుల్ సత్తార్ మాట్లాడుతూ హోదా, జాతి, కుల, మత, లింగ భేదాలతో సంబంధం లేకుండా మానవులందరికీ స్వేచ్ఛ, సమానత్వం, భావప్రకటన లాంటి మౌలిక హక్కులు కల్పించబడ్డాయని అన్నారు. ప్రతి వ్యక్తి సమాజంలో ఒక సభ్యుడుగా అనుభవించే కనీస హక్కులనే మానవ హక్కులు అంటారని, చట్టబద్ధమైన మానవ హక్కులపై అవగాహన కల్పించే లక్ష్యంతో ప్రతి ఏటా డిసెంబర్ 10న అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని జరుపుకుంటామని, తద్వారా పౌరులు సంపూర్ణ స్వేచ్ఛతో జీవించవచ్చని తెలిపారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులతో వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హక్కులు లేని మనిషి బానిసతో సమానం

ప్రజాశక్తి - కనిగిరి

మాట్లాడుతున్న జడ్జి రూప శ్రీ

హక్కులు లేని మనిషి బానిసతో సమానమని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి బిరూపశ్రీ అన్నారు. మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకొని కనిగిరి కోర్టు ఆవరణంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి రూపశ్రీ మాట్లాడుతూ ఎవ్వరికీ స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం నిరాకరించబడరాదన్నారు. మానవుడు స్వతంత్రంగా జీవించి, తన మనుగడ కాపాడుకోవడానికి హక్కులు ఊతమిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎలాంటి వివక్షకు గురికాకుండా సమాన హక్కులతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల

సిఎం చంద్రబాబు రుణం తీర్చుకోవాలి

ప్రజాశక్తి-మార్కాపురం

ఈ ప్రాంత ప్రజల కల సిఎం చంద్రబాబు నెరవేర్చారని, మార్కాపురం జిల్లా ఇచ్చిన చంద్రబాబు రుణం ప్రజలు తీర్చుకోవాలని మార్కాపరం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి సూచించారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నానని చెప్పారు. మార్కాపురం జిల్లా ఇచ్చిన నేపథ్యంలో కృతజ్ఞతా సభ స్థానిక 13వ వార్డులో బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు, మార్కాపురం జిల్లా సాధన తన లక్ష్యమని అన్నారు. జిల్లా సాధించామని, వెలిగొండ ప్రాజెక్టు కూడా త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు ఇబ్రహీంఖాన్, క్లస్టర్ ఇన్‌చార్జి కొప్పుల శ్రీనివాసులు, ఎపి ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ సయ్యద్ సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

వరి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-పొదిలి

వరి పంటలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు సూచించారు. బుధవారం మండలంలోని వేలూరు, టి సల్లూరు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి డి శ్రీనివాసులు వరి పంటను పరిశీలించారు. వరిలో కాండం తొలిచే పురుగు ఆశించిందని, ఇది నారుమడి నుంచి ఈనికి దశ వరకు ఉంటుందన్నారు. తెగులు సోకిన పొలంలో పరిశుభ్రత పాటించాలని, మురుగునీరు నిల్వ ఉండకుండా, విత్తన శుద్ధి చేయాలని, పైరు ఆరోగ్యంగా పెరిగేలాగా పోషకాలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

శాంతినగర్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని వినుకొండ రోడ్డు శాంతినగర్‌లో గల బేతేలు విశ్వాస ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం స్థానిక సంఘ కాపరి చాట్ల ప్రేమ్‌సాగర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నుంచి విచ్చేసిన ముఖ్య ప్రసంగీకులు రెవ. డాక్టర్ నేతల ధనుంజయ, రెవ. సురేష్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా యర్రగొండపాలెం నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవ. ఎస్ సుందర్‌రాజు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ వేడుకలలో చాట్ల దీవెనమ్మతో పాటు దైవజనులు పాల్గొన్నారు.

మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఎంఎస్ఎంఇ పార్క్ పరిశీలన

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని నెన్నూరుపాడు గ్రామంలో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఇ పార్కును జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ బుధవారం పరిశీలించారు. ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటు శంకుస్థాపన చేసిన సర్వేనెంబరు 433లో 44.31 ఎకరాల భూమిని జేసీ పరిశీలించారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి ఆ భూమికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎపి11 సి జోనల్ మేనేజర్, తహశీల్దారు శీలం శ్రీనివాసరావు, ఆర్ఐ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ రాజు, గ్రామ నాయకుడు తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

5కె రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఉత్సాహంగా 5కె రన్

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

77వ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంపిడిఒ తేళ్ల రవికుమార్ ఆధ్వర్యంలో చదలవాడ నుంచి నాగులుప్పలపాడు వరకూ బుధవారం 5కె రన్‌ను నిర్వహించారు. 6కె రన్‌ను ఎమ్మెల్యే విజయకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శారీరక వ్యాయామం ప్రతి ఒక్కరికి అవసరమని తెలిపారు. తద్వారా మానసిక ఉల్లాసాన్ని పెంపొందుతుందని తెలిపారు. అనంతరం చదలవాడ చతుర్వాటిక నుంచి నాగులుప్పలపాడు బస్టాండ్ సెంటర్ వరకూ 5కె రన్ నిర్వహించారు. అక్కడ మానవహారం నిర్వహించారు. 5కె రన్‌లో ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో సచివాలయ, అంగన్ వాడీ, ఆశావర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు వివిధశాఖల అధికారులుపాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

మహిళలకు రక్షణ చట్టాలు చేయాలి

ప్రజాశక్తి-దర్శి

మహిళలు చిన్నారులపై హింస వేధింపులను అరికట్టేందుకు రక్షణ చట్టాలు చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) దర్శి పట్టణ సహాయ కార్యదర్శి తాండవ లక్ష్మి కోరారు. మహిళలపై జరుగుతున్న లైంగిక హింసకు వ్యతిరేకంగా నవంబర్ 25 నుంచి ఈనెల 10 వరకూ నిర్వహిస్తున్న ప్రచార ఉద్యమంలో భాగంగా బుధవారం చోటపాలెం రోడ్‌లోని రామా నగర్ బజార్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ మాట్లాడుతూ పుట్టుక నుంచి మరణం వరకు అన్ని దశల్లోనూ ఇంటా బయట మహిళలు అవమానాలకు, లైంగిక దాడులకు గురవుతూనే ఉన్నారన్నారు. ప్రతి పది నిమిషాలకు ఒక మహిళ హత్యకు గురవుతున్నట్లు తెలిపారు. 2021లోనే ప్రపంచంలో 45 వేల మంది బాలికలు తమ సంబంధీకుల చేతుల్లో హత్యకు గురైనట్లు తెలిపారు. ఫేక్ వీడియోల ద్వారా మహిళలను నగ్నంగా చూపిస్తూ బ్లాక్మెయిల్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తాండవ పద్మ, సందు రంగమ్మ, రమాదేవి, దివ్య పాల్గొన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు : ఉగ్ర

ప్రజాశక్తి- కనిగిరి

ప్రజలను తప్పుదోవ పట్టించేలా కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తే వైసిపి మళ్లీ ఓటమిని చవిచూడాల్సి వస్తుందని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. స్థానికఅమరావతి గ్రౌండ్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ హయాంలో మెడికల్ కళాశాలలో మంజూరు చేశామని వైసిపి గొప్పలు చెప్పుకుంటుందన్నారు. కళాశాలల నిర్మాణం గోడలు, స్లాబ్ స్థాయిని దాటలేదని గుర్తు చేశారు. ఈ పరిస్థితిలో ఉన్న కాలేజీల ద్వారా వైద్య సేవలను పేద ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. కోటి సంతకాల పేరుతో ప్రచారం చేయడం సరి కాదన్నారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయడంలో వైఫల్యం చెందారని, ఆ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ఇంటింటికి కుళాయి పథకం పైలాన్ కే పరిమితమైందని, అప్పుడు సంతకాల సేకరణ ఎందుకు చేపట్టలేదన్నారు. ఈ టిడిపి పట్టణ అధ్యక్షుడు షేక్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

ఫిరోజ్, పట్టణ యూత్ అధ్యక్షుడు అచ్చాల రవి, మండల అధ్యక్షుడు కొండా కష్టారెడ్డి, కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసరెడ్డి, టిడిపి నాయకులు బాలు ఓబుల్ రెడ్డి, తమ్మినేని వెంకట్ రెడ్డి, కొల్లూరి శ్రీనివాసులు, తమ్మినేని సురేంద్ర, ఉండేల శ్రీనివాసులు, పెన్నా వెంకటేశ్వర్లు, మాలపాటి ఓబుల్ రెడ్డి, చింతలపూడి తిరుపాల్, గుడిపాటి ఖాదర్, నంబుల వెంకటేశ్వర్లు, బి రామ సుబ్బారెడ్డి, అమ్మిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, కొంగలేటి సూర్యనారాయణ రెడ్డి, కరణం అరుణమ్మ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి

ప్రజాశక్తి-టంగుటూరు

ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26,000 ఇచ్చి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఎంపిడిఒ దేవసేనకుమారికి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ గత 19 సంవత్సరాలుగా ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ గ్రామ పంచాయతీ స్థాయిలో సుస్థిర శాశ్వత వనరులు ఏర్పాటుకు తోడ్పతున్నట్లు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు నెలకు రూ.5,745 మాత్రమే వేతనంగా ఇస్తున్నట్లు తెలిపారు. దీంతో వారి కుటుంబ పోషణ కష్టంగా మారిందన్నారు. అర్హత అనుభవం కలిగిన ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ మండల అధ్యక్షుడు నంబూరి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు కరవాది పవన్, ఎఫ్ఎలు పాటిబండ్ల జాన్ బాబు,.అద్దంకి వెంకట్రావు, దార్ల హర్ష, పొంతగాని వెంకట్రావు, వల్లూరు రత్తమ్మ, కసుకుర్తి శ్రావణి, పొనుగోటి మహేష్, సిఐటియు నాయకులు మోజెస్ పాల్గొన్నారు.

ఎస్.కొండలో వినతి పత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

శింగరాయకొండ : ఉపాధి హామీ చట్టంలో గత 19 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూఉపాధి కూలీలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.26 వేల కనీసం వేతనం ఇవ్వాలని కోరుతూ ఎంపిడిఒ డి. జయమణి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు టంగుటూరి రాము, టి. రామ్మూర్తి, ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ మండల అధ్యక్షుడు నంబూరి, జి.రమాదేవి, కార్యదర్శి వెంకటాద్రి, ఎఫ్ఎ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీత రాజశేఖర్‌రాజుకు సన్మానం

ప్రజాశక్తి-దర్శి

జల సంరక్షణ-2024 సంవత్సరానికి రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న దర్శి ప్రాంతానికి చెందిన పొదిలి రాజశేఖర్‌రాజును ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. రాజశేఖర్‌రాజు గుంటూరు జిల్లాలో విద్యార్థి దశలో ఎస్ఎఫ్ఐ నాయకుడిగా పని చేశారు. అప్పట్లోనే విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేశారు. వ్యక్తి, స్వచ్ఛంద సంస్థ ద్వారా దాదాపు 200 పైగా వాటర్ షెడ్యూల్‌ను ఏర్పాటు చేసి ప్రజల మన్ననలు పొందారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో నీటి కొరతగా ఉన్న గ్రామాల్లో ప్రజలను ఒప్పించి ఎంతో కష్టపడి వాటర్ షెడ్యూల్‌ను ఏర్పాటు చేశారు. ఈసేవలను గుర్తింఛిన ప్రభుత్వం రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ చేతుల మీదుగా అవార్డును అందజేశారు. అందులో భాగంగా రాజశేఖర్‌రాజును

రాజశేఖర్ రాజును సన్మానిస్తున్న నాయకులు

డివైఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ, సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మాజీ నాయకులు తాండవ రంగారావు, సందు వెంకటేశ్వర్‌రావు, ఉప్పుటూరి నాగరాజు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కెవి.పిచ్చయ్య, డివైఎఫ్ఐ నాయకులు బిజ్జం శ్రీనివాసులరెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకుడు అభి, ఎల్ఐసి నాయకులు రామకోటిరెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

తిరుపతిరెడ్డికి మంత్రి అభినందనలు

ప్రజాశక్తి -హనుమంతుని పాడు

హనుమంతునిపాడు మండలంలో గతంలో కంటే అధిక మెజార్టీ తెచ్చేందుకు కృషి చేసినందుకు, యువగళం పాదయాత్రలో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేసినందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ టిడిపి మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి అభినందించారు.

బుక్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన శిక్షణా తరగతులకు హాజరైన తిరుపతి రెడ్డిని లోకేష్ అభినందించారు. యువగళం పాదయాత్ర సందర్భంగా ముద్రించిన పుస్తకాన్ని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చేతుల మీదుగా కనిగిరి అమరావతి గ్రౌండ్‌లో సానికొమ్ము తిరుపతిరెడ్డికి అందజేశారు.

స్క్రబ్ టైఫస్ కలకలం

ప్రజాశక్తి-కొనకనమిట్ల : మండల పరిధిలోని అంబాపురం స్క్రబ్ టైఫస్ కలకలం రేగింది. ఓ వ్యక్తికి ఈ వ్యాధి సోకినట్లు వైద్యులు గుర్తించారు. ఒంగోలు జిజిహెచ్ తరలించి వైద్యసేవలు అందిస్తున్నట్లు ప్రభుత్వ వైద్యురాలు సురేఖ తెలిపారు. ప్రజలందరూ ఈ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆమె తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి -నాగులుప్పలపాడు : బైకు అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఉప్పుగుండూరు గ్రామంలో నున్న వసుంధర కోల్డ్ స్టోరేజ్ వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మద్దిపాడు మండలం తిమ్మనపాలెం గ్రామానికి చెందిన బోజేపల్లి కోటయ్య(32) బైకుపై ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన తన స్నేహితుడి గ్రామంలో వదిలి పెట్టి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో బైకు అదుపు తప్పి ఎదురుగా ఉన్న చెట్టును ఢీకొంది. దీంతో కోటయ్య అక్కడికి అక్కడే మృతిచెందాడు. మృతుడికి మూడు రోజుల క్రితం పాప పుట్టింది. మతదేహనిన పోస్టు మార్టం ఒంగోలు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-కొండపి : మండల పరిధిలోని మద్దులూరు రోడ్డులో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించి ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ప్రేమ్ కుమార్ తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.2720 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి నాగులుప్పలపాడు : వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాల య్యాయి. అందిన వివరాల ప్రకారం.. ఉప్పుగుండూరు సమీపంలోని మట్టిగుంట రోడ్డులోని పెట్రోలు బంకు వద్ద బైకులు ఢీకొన్న ఘటనలో ముప్పాళ్ళ గ్రామానికి చెందిన కోటేశ్వరరావుకు గాయాలయ్యాయి. క్షత^గాత్రుడిని 108 వాహనంలో ఒంగోలు తరలించారు. నిడమానూరు గ్రామానికి చెందిన ఎ. వెంకటేశ్వర్లు ,మురళీ బైకుపై ఒంగోలు వెళ _ండగా త్రోవగుంట సమీపంలో రోడ్డుకు అడ్డుగా వచ్చిన గేదెను తప్పించబోయి బైకు బోల్తా కొంది. దీంతో వారిద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

జీవో కాపీలు దహనం

ప్రజాశక్తి -నాగులుప్పలపాడు

కేంద్రప్రభుత్వం విత్తనచట్టం, విద్యుత్ బిల్లును సవరిస్తూ తీసుకొచ్చిన జీవోను రద్దుచేయాలని కోరుతూ రైతుసంఘాల ఆధ్వర్యంలో ఆ జీవో కాపీలను మంగళవారం దహనం చేశారు. సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకుడు టి. శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర పరిధిలోని వ్యవసాయం ,విద్యుత్ బిల్లులను కేంద్రప్రభుత్వం ఆధీనంలోకి తీసుకొని పార్లమెంట్‌లో ఈనెల 11న చర్చకు అవకాశం కల్పించిందన్నారు దీనికి వ్యతిరేకంగా ఎస్‌కెఎం పిలుపులో భాగంగా అమ్మనబ్రోలులో జీవో కాపీలను దహనం చేసినట్లు తెలిపారు. ఈ బిల్లు అమలులోకి వస్తే విత్తన ,విద్యుత్ రంగాలు కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి పూర్తిగా వెళతాయన్నారు. తద్వార భవిష్యత్‌లో రైతులు ప్రజలు నష్టపోతారన్నారు, ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు రావెళ్ళ వెంకట్రావు, చెరుకూరి వాసు, ప్రభుదాస్ ,గాదె నాగేశ్వరరావు, ప్రవీణ్ పాల్గొన్నారు.

మోడల్ టెస్టు పేపర్లు అందజేత

ప్రజాశక్తి-దర్శి

స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలలో వన్డే ఓరియంటేషన్ ప్రోగ్రాం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తత్వం కలిగిన ఇజ్జగిరి పెద్దకాశయ్య, జనరాజుపల్లి యలమంద పదో తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో తయారు చేసిన మోడల్ టెస్టు పేపర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఎస్‌కె. మేరాసాహెబ్, గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసలైన లబ్ధిదారులకే ఆటోనగర్ స్థలాలివ్వాలి

కలెక్టరేట్ వద్ద ఆటోనగర్ స్థలాల లబ్ధిదారుల నిరసన

ప్రజాశక్తి - బాపట్ల

చీరాల ఆటోనగర్ స్థలాలు అసలైన లబ్ధిదారులైన ఆటో మొబైల్ వర్కర్లకు ఇవ్వాలని కోరుతూ సిపిఎం నాయకులు పి కొండయ్య ఆధ్వర్యంలో ఆటోనగర్ స్థలాల లబ్ధిదారులైన ఆటోమొబైల్ వర్కర్లు కలెక్టర్‌కు వినతి పత్రం బుధవారం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీరాల పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఆటోమొబైల్ పనులు చేసుకుంటూ కుటుంబాలు పోషించుకుంటున్న నిరుపేదలు 1990 దశకంలో పట్టణంలో రద్దీని దృష్టిలో పెట్టుకొని అప్పటి ఆటో మొబైల్ కార్మికులకు షాపులు, కారా?నాలకు ఊరు బయట ప్రత్యేక ప్రాంతానికి తరలించాలని నిర్ణయించారని అన్నారు. అందులో భాగంగా ఎపిఐఐసి సహకారంతో ఈపురుపాలెంలో సమీపంలో స్టువర్టుపురం స్మశాన వాటికకు దగ్గర్లో ఆటోనగర్ కోసం ఈపురుపాలెం ఊరు చివర చీరాల, బాపట్ల రహదారిలోని సాల్వేషన్ ఆర్మీకి చెందిన 40 ఎకరాల స్థలాన్ని ఎపిఐఐసి కొనుగోలు చేసిందని తెలిపారు. దానికోసమైన ఖర్చును 400 మంది లబ్ధిదారుల నుండి డిడిల రూపంలో సేకరించిన డబ్బు చెల్లించి ఎపిఐఐసి సాల్వేషన్ ఆర్మీ నుండి భూమి కొనుగోలు చేసిందని తెలిపారు. మరో 10 ఎకరాలు ఈపురుపాలెం పంచాయతీ నుండి సమీకరించారని తెలిపారు. ఆ స్థలంలో ప్లాట్లు వేశారని అన్నారు. అనంతరం ఆ స్థలంపై కొందరు కోర్టుకు వెళ్ళడంతో పనులు నిలిచి పోయాయని తెలిపారు. తిరిగి 250 మంది లబ్ధిదారులు ఒక్కొక్కరు రూ.7500 చొప్పున చందాలు వసూలు చేసి నాలుగేళ్లు కోర్టు చుట్టూ తిరిగిన నేపథ్యంలో కోర్టు ఆటోమేబైల్ కార్మికులకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని చెప్పారు. అనంతరం తారు రోడ్లు, విద్యుదీకరణ పనులు ప్రభుత్వం పూర్తి చేసిందని తెలిపారు. ఆటోనగర్ స్థలం అన్యాక్రాంతం కాకుండా, ఇసుక వ్యాపారులు ఇసుక తరలించుకు పోకుండా సొంత ఖర్చులు వెచ్చించి జీతం చెల్లిస్తూ వాచ్ మెన్‌ను ఏర్పాటు చేసుకుని ఆ స్థలాన్ని కాపాడుకున్నట్లు తెలిపారు. దీనిపై గత ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకోలేదని అన్నారు. ప్రస్తుతం ఆ స్థలాలను చీరాలకు సంబంధం లేని విజయవాడ, గుంటూరు, హైదరాబాదు నివాసులకు లబ్ధిదారులతో సంబంధం లేకుండా అగ్రిమెంట్లు చేసి కట్టబెడుతున్నారని అన్నారు. గడచిన 35ఏళ్ళుగా స్థలాన్ని కాపాడుకున్న ఆటోమొబైల్ వర్కర్లకు స్థలాలు ఇవ్వకుండా బయటి వ్యక్తులకు స్థలాలు కట్టబెట్టడం ఏమిటని ప్రశ్నించారు. చిన్న, చిన్న షాపుల్లో దుకాణాలు పెట్టుకొని జీవించే సాధారణ కార్మికులు ఎపిఐఐసి నిర్ణయించిన ధరకు రిజిస్టర్ చేస్తే బ్యాంకుల్లో పెట్టుకొని రుణాలు పొంది షాపులు ఏర్పాటు చేసుకోగలరని ఎపిఐఐసికి విన్నవించారు. ఆ ప్రతిపాదన నచ్చక చీరాల ఆటోనగర్‌ను పారిశ్రామికవేత్తల పేరుతో బయటి వారికి కట్టబెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికేతరుల అగ్రిమెంట్లు రద్దు చేయాలని కోరారు. సబంధం లేని వ్యక్తులు చేస్తున్న నిర్మాణాలు నిలిపివేయాలని అన్నారు. ఆయా స్థలాలను వాస్తవ లబ్ధిదారులకు ఎపిఐఐసి రిజిస్టర్ చేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు చీరాల నుండి ద్విచక్ర వాహనాలతో బాపట్ల వరకు ర్యాలీ నిర్వహించారు. చీరాల తాలూకా ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ నాయకులు దావూద్ భాషా, శంకర్రావు, బుడే, సాంబయ్య, జిలాని, రామిరెడ్డి, ఆమన్ పాల్గొన్నారు.

చీరాల : ఆటోనగర్ స్థలాలు వాస్తవ లబ్ధిదారులకే కేటాయించాలని కోరుతూ ఆటోనగర్ యూనియన్ నాయకులు ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా బాపట్ల కలెక్టరేట్ వరకు వెళ్లారు. చీరాల గడియార స్తంభం సెంటర్లో ఆటోనగర్ యూనియన్ నాయకులు ఆటోనగర్ పూర్వపరాలు వివరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి కొండయ్య, చీరాల తాలూకా ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ నాయకులు దావూద్ భాష, బుడే సాహెబ్, శంకర్రావు, జిలాని, ఇంతియాజ్, రామిరెడ్డి పాల్గొన్నారు.

చీరాల పట్టణంలో ర్యాలీ చేస్తున్న ఆటోమొబైల్ కార్మికులు

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి

సిఐటియు మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - అద్దంకి

సిఐటియు అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి కోరారు. స్థానిక సుందరయ్య భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. డిసెంబర్ 31 నుండి జనవరి 4వరకు విశాఖపట్నంలో మొట్ట మొదటిసారి సిఐటియు అఖిల భారత మహాసభలు జరుగుతున్నాయన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి 2వేల మంది ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. మహాసభల పరిశీలనకు విదేశీ ప్రతినిధులు కూడా హాజరవుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌తో కార్మిక వర్గం కట్టు బానిసలుగా మారబోతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూడా మోడీ ప్రభుత్వానికి తలవంచి కార్మిక చట్టాలు మారుస్తూ 8 నుండి 13 గంటల పనివిధానం మార్చారని అన్నారు. రాష్ట్రంలో గత ఐదేళ్లుగా స్కీం వర్కర్లు, అంగనవాడిలు, ఆశాలు, విఒఎలు వంటి స్కీం వర్కర్ల వేతనాలు పెంచలేదని అన్నారు. రాష్ట్రంలో స్కీం వర్కర్లకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం మహాసభల్లో పలు తీర్మానాలు చేయబోతున్నట్లు తెలిపారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుంధార్, సిఐటియు అద్దంకి కార్యదర్శి కె వెంకటేశ్వర్లు, విఒఎ సంఘం జిల్లా అధ్యక్షుడు పుణ్యలక్ష్మి, విఒఎస్ సంఘం నాయకులు కృష్ణకుమారి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ న్యాయవాదిగా 'బాచిన'

ప్రజాశక్తి - పంగులూరు

బి హనుమంతరావు

ఎపి హైకోర్టులో కేంద్ర ప్రభుత్వం తరపున వాజ్యాలు వాదించేందుకు పంగలూరుకు చెందిన బాచిన హనుమంత రావును కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ నియమించింది. ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు సేవలు అందిస్తారు. గతంలో హైకోర్టు న్యాయవాద సంఘానికి కార్యదర్శిగా పనిచేశారు. పలు జాతీయ బ్యాంకులకు ప్యానెల్ అడ్వకేట్‌గా ఉన్నారు. ఆయనకు ఈ పదవి రావడం పట్ల గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు.

విద్యార్థులను అభినందిస్తున్న వనమ రామకృష్ణారావు

ఎల్ఐసి స్కాలర్‌షిప్‌కు ఎంపిక

ప్రజాశక్తి - వేటపాలెం

సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఎల్ఐసి అందించే స్కాలర్‌షిప్ సాధించినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఇటీవల ఎల్ఐసి ప్రకటించిన జాతీయ స్థాయి స్కాలర్షిప్‌లను కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె జగిదష్ బాబు తెలిపారు. కళాశాల సిఎస్ఇ మొదటి సంవత్సం చదువుతున్న విద్యార్థిని దాక్షిణ్య, ఇసిఇ విద్యార్థులు ఆర్ గీతామాధురి, వి పావని ప్రియ పొందినట్లు తెలిపారు. ఈ స్కాలర్షిప్ క్రింద సంవత్సరానికి రు.30వేల చొప్పున నాలుగేళ్లు ఎల్ఐసి అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన అభినందన సభలో ఫస్ట్ ఇయర్ ఇన్‌చార్జ్ ఎస్ అమరనాధ్ బాబు, సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ పి హరిణి, ఇసిఇ విభాగాధిత డాక్టర్ డి రాజేంద్ర ప్రసాద్, మేనేజర్ ఆర్‌వి రమణమూర్తి, డైరెక్టర్ డాక్టర్ సి సుబ్బారావు విద్యార్థులను అభినందించారు.

ఉపాధ్యాయుల నిరసన ర్యాలీ

సుప్రీం కోర్టు తీర్పుపై రాష్ట్రప్రభుత్వం రివ్వూ పిటిషన్ వెంటనే వేయాలి: యుటిఎఫ్

వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - బాపట్ల

సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు రెండేళ్ల లోపు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టిఇటి) తప్పని సరిగా ఉత్తీర్ణులు కావాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పిటిషన్లు వేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె వినయ్ కుమార్ అన్నారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో తహశీల్దారు షేక్ సలీమాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెట్ పరీక్షలు ఉత్తీర్ణత సాధించలేని ఉపాధ్యాయులను సర్వీస్ నుండి తొలగించాలని 2025 సెప్టెంబర్ 1న సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పు ప్రాస్పెక్టివ్‌గా కాకుండా రేట్రాస్పెక్టివ్‌గా వర్తించే విధంగా ఉందని అన్నారు. 2011కు ముందు ఉపాధ్యాయులుగా నియమితులైన వారికి వర్తిస్తున్న కారణంగా రాష్ట్రంలో లక్ష మంది ఉపాధ్యాయులు టెట్ పరీక్ష ఉత్తీర్ణులు కావాల్సి వస్తుందన్నారు. దీంతో ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలని చేసిన ఉపాధ్యాయుల విన్నపం మేరకు విద్యాశాఖ మంత్రి రాష్ట్ర ప్రభుత్వం తరపున రివ్యూ పిటిషన్ వేయనున్నట్లు ప్రకటించారు. అయితే ప్రభుత్వం తరపున రివ్యూ పిటిషన్ దాఖలు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుదన్నారు. సుప్రీం కోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ వేగవంతం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి సర్వీసులోని ఉపాధ్యాయులకు తగు న్యాయం చేయాలని కోరుతూ కార్యాచరణ చేపట్టాలని యుటిఎఫ్ నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు, డేవిడ్, బాపూజీ, రాజేష్ పాల్గొన్నారు.

అద్దంకి : విద్యాహక్కు చట్టానికి సవరణలు చేయాలని కోరుతూ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు అందరూ రెండేళ్లలోపు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ తప్పని సరిగా ఉత్తీర్ణులు కావాలని, లేకుంటే వారిని సర్వీస్ నుండి తొలగించాలని 2025 సెప్టెంబర్ 1న సుప్రీంకోర్టు తీర్పు వెలువరచిందని, అయితే సదరు తీర్పు ప్రాస్పెక్టివ్‌గా కాకుండా రీట్రాస్పెక్టివ్‌గా వర్తించే విధంగా ఉన్నందున మన రాష్ట్రంలో లక్షమంది ఉపాధ్యాయుల భవితవ్యం ప్రమాదంలో పడిందని యుటిఎఫ్ అధ్యక్షులు రామారావు అన్నారు. డిఎస్సీల ద్వారా నియమితులై సేవల్లో అనేక శిక్షణలు పొందిన తర్వాత సర్వీస్‌లో కొనసాగాలంటే టెట్ పరీక్ష ఉత్తీర్ణులు కావాలని కోర్టు తీర్పు ఇవ్వడం పట్ల ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయడం, లేదా విద్యాహక్కు చట్టం సెక్షన్ 23(2)లో మార్పులు చేయాల్సి ఉంటుందని న్యాయ నిపుణులు చెబుతున్నారని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై మన రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలని తాము ఇచ్చిన ప్రాతినిధ్యం మేరకు విద్యాశాఖా మంత్రి కూడా రాష్ట్ర ప్రభుత్వం తరపున రివ్యూ పిటిషన్ వేయనున్నట్లు ప్రకటించారని గుర్తు చేశారు. కాని ప్రభుత్వం తరపున రివ్యూ పిటిషన్ దాఖలు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు సత్వరమే న్యాయం చేయాలని కోరుతూ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం నుండి ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయుల ఆందోళనను పరిగణనలోకి తీసుకుని సత్వరమే సమస్య ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

వినతి పత్రం అందజేస్తున్న అంగనవాడీ కార్యకర్తలు

12న కలెక్టరేట్ వద్ద అంగనవాడీల ధర్నా

ప్రజాశక్తి - నిజాంపట్నం

అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని కోరుతూ ఈనెల 12న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్నట్లు తెలియజేస్తూ పల్లపట్ల సిడిపిఓ అనసూయకు వినతి పత్రం బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ప్రాజెక్ట్ ఉపాధ్యక్షురాలు డి బేబీరాణి మాట్లాడుతూ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం తమ వేతనాలు పెంచాలని కోరారు. అంగన్‌వాడీలు రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న ఆందోళనలో భాగంగా పల్లపట్ల ప్రాజెక్టు పరిధిలో ఈనెల 12న ఆందోళనలో పాల్గొంటున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, అర్హులైన ఆయాలకు పదోన్నతులు ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని అన్నారు. అన్ని యాప్‌లు కలిపి ఒక యాప్‌గా మార్చి తమపై భారం తగ్గించాలని కోరారు. ఎస్ఆర్ఎస్ రద్దు చేయాలని అన్నారు. గ్రాట్యూటీ అమలుకు మార్గదర్శకాలు రూపొందించాలని అన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని, పెండింగులో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులు వెంటనే భర్తీచేయాలని, లబ్దిదారులకు ఆయిల్, కందిపప్పు పరిమణం, మెనూ చార్జీలు పెంచాలని కోరారు. ఉచితంగా గ్యాస్ సరఫరాచెయ్యాలని, ప్రీ స్కూల్ బలోపేతం చేయాలని, ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం అమలు చేయాలని, 5ఏళ్లలోపు పిల్లలందరూ అంగన్వాడీసెంటర్లో ఉండేవిధంగా జిఒ ఇవ్వాలని కోరారు. ప్రీస్కూల్ పిల్లలకు సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలనే డిమాండ్స్ కోసం ధర్నాలో పాల్గొంటున్నట్లు తెలిపారు. సమ్మె కాలంలో ఒప్పందాలు అమలు చేయాలని కోరారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమ శిభిరాల వద్దకు వచ్చి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలపట్ల సెక్టార్ పరిధిలోని యూనియన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇపిఎఫ్-95పై ఢిల్లీలో పెన్షనర్ల గర్జన

జంతర్ మంతర్ వద్ద ధర్నాలో 'ప్రకాశం' నేతలు

ధర్నాలో పాల్గొన్న ప్రకాశం నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

దేశవ్యాప్తంగా ఇపిఎఫ్-95 పెన్షనర్ల జీవనోపాధి తీవ్రమవుతున్న నేపథ్యంలో కనీస పెన్షన్‌ను రూ.9 వేలుగా నిర్ణయించి.. డిఎతో కలిపి చెల్లించాలని కోరుతూ రెండు రోజుల పాటు ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద జరిగిన ధర్నా బుధవారంతో ముగిసింది. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సనల్స్ అసోసియేషన్ పిలుపుతో జరిగిన ఈ నిరసనలో అన్ని రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో పెన్షనర్లు ఢిల్లీలో ప్రభుత్వ వైఖరిని ఖండించారు. ప్రకాశం జిల్లా నుంచి సంఘం ప్రధాన కార్యదర్శి సిహెచ్.రాంబాబు ఆధ్వర్యంలో బివి రావు, యల్లమందారెడ్డి, మీగడ వెంకటేశ్వరరెడ్డి, కె.సంజీవరావు, ఎం. అంజయ్య, బివి రమణయ్య, ఎస్కే జానీబాషా, ఎస్కే ఆంజనేయులు, అల్లడి సుబ్బారావు, వి రామలింగారెడ్డి తదితరులు హాజరై జిల్లా సమస్యలను జాతీయ వేదికపై ప్రస్తావించారు. నాయకులు మాట్లాడుతూ ఇపిఎఫ్ ట్రస్టు వద్ద మార్చి 2025 నాటికి రూ.10 లక్షల కోట్లు నిల్వగా ఉండగా, సంవత్సరానికి రూ.60 వేల కోట్లు వడ్డీ రూపంలో జమవుతున్నప్పటికీ, పెన్షన్ దారులకు కేవలం రూ.23 వేల కోట్లు మాత్రమే చెల్లిస్తున్నారని ఆరోపించారు. కనీసం వడ్డీ కూడా చెల్లించక పెన్షనర్ల జీవన ప్రమాణాలు దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. హయ్యర్ పెన్షన్ అమలుపై సుప్రీంకోర్టు తీర్పులు వెలువడినా ఇపిఎఫ్ఒ వివిధ రూపాల్లో అడ్డంకులు సృష్టిస్తోందని నేతలు మండిపడ్డారు. హయ్యర్ పెన్షన్‌కు 17.49 లక్షల మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినా ఇప్పటివరకు కేవలం 16,282 మందికే హయ్యర్ పెన్షన్ మంజూరు చేయడం తీవ్ర అన్యాయమని విమర్శించారు. ప్రభుత్వం రద్దు చేసిన రైల్వే సీనియర్ సిటిజన్ రాయితీ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వయోవృద్ధులకు ఉచిత వైద్య సేవలు, అర్హులందరికీ హయ్యర్ పెన్షన్ అమలు వంటి కీలక సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

త్వరలో గ్రానైట్ వ్యర్థాల

డంపింగ్ స్థలం గుర్తింపు

- కలెక్టర్ రాజాబాబు
- బిపిపీ మిడ్ వేస్ట్ క్వారీ, కృష్ణసాయి పాలిషింగ్ యూనిట్ సందర్శన

గ్రానైట్ పాలిషింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి-చీమకుర్తి

గ్రానైట్ వ్యర్థాల డంపింగ్ కోసం స్థలాన్ని అధికారులు గుర్తిస్తున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. బుధవారం ఆయన సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్.విజయ్‌కుమార్, మైనింగ్ డిడి రాజశేఖర్‌తో కలిసి రామతీర్థంలోని ఏపీ మిడ్‌వేస్ట్ గ్రానైట్ గనిని పరిశీలించారు. క్వారీయింగ్ జరుగుతున్న తీరును, కార్మికులు పనిచేస్తున్న పరిస్థితులను ఆయన అడిగి తెలుసుకున్నారు. క్వారీలో రాళ్ల వెలికితీత వివరాలను పరిశీలించారు. అనంతరం స్థానిక కష్ణసాయి గ్రానైట్ పాలిషింగ్ యూనిట్‌ను సందర్శించారు. అక్కడ యూనిట్లో పాలిషింగ్ చేస్తున్న దశ్యాలను పరిశీలించారు. కృష్ణసాయి గ్రానైట్ ప్రతినిధి శిద్దా భరత్ పరిశ్రమ వివరాలను కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గత ఏడాది మైనింగ్ ద్వారా రూ.180 కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ ఏడాది రూ.220 కోట్లు లక్ష్యంగా ఉన్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో మైనింగ్ ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మైనింగ్ యజమానులకు ఎలాంటి సమస్యలు ఉన్న అధికారులు తక్షణం స్పందిస్తారని తెలిపారు. మైనింగ్ కార్యకలాపాలతో పాటు వచ్చే వ్యర్థాల పట్ల యజమానులు దష్టి సారించాలన్నారు. కార్మికుల ఆరోగ్యం పట్ల యజమానులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రాంగం తగు ఆరోగ్య శిబిరాలు కూడా ఏర్పాటు చేస్తుందన్నారు. రెవెన్యూ సమస్యల మీద అధికార యంత్రాంగం ప్రత్యేక దష్టి సారించాలని సూచించారు. తప్పు చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూముల ఆన్లైన్ ప్రక్రియలో నిబంధనల ప్రకారం పనిచేయాలని సూచించారు. జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలతో ప్రజల్లో రెవెన్యూ సమస్యలు పరిష్కారం అవుతున్న తీరుపై సానుకూల అభిప్రాయం పెరిగిందన్నారు. ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మైనింగ్ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిఎంఎఫ్ నిధులతో ప్రజల అవసరాలు తీర్చడంపైనా దష్టి పెట్టినట్లు తెలిపారు. గ్రానైట్ యజమానులకు అవసరమైన సహాయాన్ని అందించే విధంగా ప్రతినెలా క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తామని పేర్కొన్నారు. పర్యావరణం, కార్మికుల ఆరోగ్యం వంటి విషయాల్లో యజమానులు నిబంధనలు ఉల్లంఘించరాదని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీసీ విజయజ్యోతి, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, మైనింగ్ డీడీ రాజశేఖర్, డిఎంఅండ్ హెచ్ఓ వెంకటేశ్వరరావు, తహశీల్దార్ ఆర్.బ్రహ్మయ్య పాల్గొన్నారు.

బీమా నిధులు విడుదల చేయాలి

గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం

అర్జీ ఇస్తున్న సంఘం నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

అయిదు నెలలుగా పశు బీమా నిధులు విడుదల కానందున జిల్లాలో గొర్రెలు-మేకల పెంపకందారులు తీవ్రమైన ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం నేతలు తెలిపారు. బుధవారం నాడు ఒంగోలులోని ఎల్బీజీ భవనంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశం అనంతరం పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి ఎన్.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర కార్యదర్శి పూసపాటి వెంకట్రావు, జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు మాట్లాడుతూ పశు బీమా నిధులు ఐదు నెలలుగా విడుదల కాకపోవడంతో బీమా చేసిన గొర్రెలు చనిపోయినా నష్టపరిహారం అందక పెంపకందారులు తీవ్ర కష్టాల్లో ఉన్నారని తెలిపారు. ట్యాగులు లేవంటూ పరిహారం నిరాకరించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం భీమా పథకాన్ని పాత విధానంలోనే ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కొండరాజు జయరాం, స్థానిక నాయకులు ముమ్మా రామరాజు తదితరులు పాల్గొన్నారు.

సముద్రంలో చేపలు పట్టే ఓడల పెంపుపై మాగుంట ప్రశ్న

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దేశం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోస్తా ప్రాంతాలలో లోతైన సముద్రపు చేపలు పట్టే మొత్తం ఓడలు, పెంపుదల, పథకాలు, నిధులు, లబ్దిదారులపై ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర మత్స్య ,పశు సంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ అలియాస్ లలన్ సింగ్ సమాధానమిచ్చారు.

అర్హులైన వికలాంగులకు పెట్రోల్ సబ్సిడీ మంజూరు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం, బాపట్ల జిల్లాలలో స్వయం ఉపాధి, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ మూడు చక్రాలు వాహనాలు కలిగి ఉన్నవికలాంగ అభ్యర్థులకు పెట్రోల్ సబ్సిడీ ప్రభుత్వం మంజూరు చేసినట్లు వికలాంగులు వయోవద్ధులు సంక్షేమ శాఖ ప్రకాశం బాపట్ల జిల్లాల సహాయ సంచాలకులు సిహెచ్ సువార్త ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి, పెట్రోల్ సబ్సిడీ మంజూరు చేస్తుందన్నారు. అర్హత కలిగి పెట్రోల్ సబ్సిడీ పొందుటకు ఆశక్తి కలిగిన వికలాంగ అభ్యర్థులు ఒంగోలు ప్రకాశం భవనం లోని వికలాంగులు, వయో వద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయం నుండి దరఖాస్తులు పొంది పూరించిన దరఖాస్తులను ఈ నెల 17 లోపు సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు కార్యాలయం ఫోన్ నెం. 08592-281310 సంప్రదించాలని సూచించారు.

'హిందీ' మెటీరియల్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

విద్యార్థుల అభ్యాసాభివృద్ధికి ఉపాధ్యాయుల సృజనాత్మక కృషి అవసరం అని జిల్లా విద్యాశాఖాధికారి ఎ. కిరణ్ కుమార్ అన్నారు. ప్రకాశం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎ. కిరణ్ కుమార్ హిందీ పాఠ్య మెటీరియల్‌ను ఆవిష్కరించారు. కొత్తపట్నం హైస్కూల్ హిందీ ఉపాధ్యాయుడు పల్లె కృష్ణమూర్తి ఈ మెటీరియల్‌ను రూపొందించాలని జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి రూ.76 లక్షలు మంజూరు

దెబ్బతిన్న రోడ్డు

ప్రజాశక్తి-మద్దిపాడు

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే బిఎన్.విజయ్‌కుమార్‌కు శ్రీవారి ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం నాడు కృతజ్ఞతలు తెలిపారు. వారు మాట్లాడుతూ మల్లవరం గ్రామంలోని ఆర్చీ నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా తయారైందన్నారు. ఆలయానిక వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పల్లె పండుగ 2.0 కార్యక్రమంలో భాగంగా రోడ్డు నిర్మాణానికి ఎస్ఏఎస్‌సిఐ నిధుల కింద రూ.76 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే బిఎన్.విజయ్‌కుమార్‌కు మల్లవరం శ్రీవారి వనం కమిటీ గౌరవ అధ్యక్షులు కావూరి వాసు, అధ్యక్షులు మార్నేని కృష్ణారావు, కమిటీ ఛైర్మన్ మార్నేని వీర రాఘవరావు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో పనులు మొదలుకానున్నాయని, వెంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. శ్రీవారి కమిటీ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. భక్తులు కూడా ఈ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు.

వీధి వ్యాపారులపై బెదిరింపులు మానుకోవాలి

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలు నగరంలో రోడ్డు విస్తరణ పేరుతో చిరు వ్యాపారులపై వేధింపు చర్యలు వెంటనే నిలిపివేయాలని సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బతుకుదెరువు కోసం ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారాలు చేసుకుంటున్న పేదలను మాత్రమే అధికారులు వేధిస్తున్నట్లు ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా మాల్స్ నిర్మాణాలు చేపట్టిన భవన యజమానులపై, మాల్స్ నిర్వాహకులపై ఏ మాత్రం చర్యలు లేకపోవడం తీవ్ర అన్యాయమని విమర్శించారు. ఒంగోలులో సుమారు 16 వేల మంది వీధి వ్యాపారులు ఉండగా.. ప్రభుత్వం మీద ఆధారపడకుండా స్వంతంగా కుటుంబాలను నెట్టుకొస్తున్నారని తెలిపారు. చదువుకున్న యువకులు, మహిళలు, పేద కుటుంబాలు చిరు వ్యాపారాలపైనే పూర్తిగా ఆధారపడుతున్నాయని చెప్పారు. రోజుకు 12-14 గంటలు కష్టపడితే వచ్చే ఆదాయం కేవలం కుటుంబ పోషణకే సరిపోతుందన్నారు. ఇలాంటి పేదల్ని బెదిరించడం అన్యాయమని అన్నారు. ట్రాఫిక్ సక్రమంగా ఉండాలంటే నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలపై ముందస్తు చర్యలు తీసుకోవాలని, నగరంలో ఎక్కడా సరైన పార్కింగ్ స్థలాలు లేకపోవడమే ప్రధాన సమస్య అని చెప్పారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద డివైడర్ల ఏర్పాటు వల్ల రాకపోకలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, బస్సులు లోపలికి ప్రవేశించడం, బయటకు రావడం కష్టమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వీధి వ్యాపారులే ట్రాఫిక్‌కు కారణమన్నట్టుగా మాట్లాడటం వారి బతుకుదెరువుపై దెబ్బ కొట్టడమేనన్నారు. ప్రజలను భయపెట్టి నిర్ణయాలు తీసుకోవడం కాదని, ప్రజల అభిప్రాయం తెలుసుకొని చర్యలు తీసుకోవడం ప్రభుత్వ ధర్మం అని శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. వీధి వ్యాపారులను ఊరి చివరికి పంపే ప్రయత్నాలను వెంటనే ఆపాలని, వారి ఉపాధిని దెబ్బతీసే నిర్ణయాలను ప్రభుత్వం పున: సమీక్షించాలంటూ డిమాండ్ చేశారు.

రామనాథంకు నివాళి

రామనాథంకు నివాళులరిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కారుసాల సుబ్బరావమ్మ, ప్రజాశక్తి బుక్ హౌస్ మేనేజర్ లక్ష్మయ్య మాతమూర్తి రామనాథం పెద్దకర్మ బుధవారం స్వగ్రామైన మండలంలోని ఒమ్మెవరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు హాజరై.. రామనాథం చిత్రపటానికి పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యే బిఎన్.విజయ్ కుమార్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ప్రజాశక్తి ఎడిటర్ తులసీదాస్, సిపిఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, బేబీరాణి, కె.ఉమామహేశ్వరరావు, ముజఫర్ మహమ్మద్, డి. రమాదేవి, అచ్యుతరావు, హరికిషోర్, ధనలక్ష్మి, మంజుందర్, జాలా అంజయ్య, పూనాటి ఆంజనేయులు, సువర్చల, పెంట్యాల హనుమంతరావు, పమిడి వెంకట్రావు, వై.సిద్ధయ్య, ఎస్‌కె.మాబు, అంద్రా మాల్యాద్రి, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎంఎల్‌వి.ప్రసాదరావు, జె.జయంతి బాబు, రావెళ్ళ వినోద్, గంగయ్య, కల్పన, కాలం సుబ్బారావు, పూసపాటి వెంకట్రావు, చీకటి శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు, రమాదేవి, బంకా సుబ్బారావు, సుధాకరరావు, వెంకట్రావు, మాజీ జడ్‌పి వైస్ చైర్మన్ మారెళ్ళ వెంకటశేషయ్య, కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

సుబ్బరావమ్మతో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

కోటి సంతకాల బండిల్స్ సిద్ధం చేస్తున్న అశోక్ బాబు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి వైద్య కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ నియోజకవర్గంలో వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫ్లెక్సీలతో ఏర్పాటు చేసిన 17 వైద్య కాలేజీల నమూనాలు చూపిస్తూ రాష్ట్రంలో ఎన్ని మెడికల్ కాలేజీలు పూర్తయినవో ప్రజలకు అర్థం అయ్యేలా ఆయన వివరించారు. రాష్ట్రంలో పూర్తి చేసిన వైద్య కాలేజీలు కూటమి ప్రభుత్వ నేతల కళ్ళకు కనబడటం లేదాని ప్రశ్నించారు. కనిపించకపోతే ఆయా నేతలు దివ్యాంగుల పెన్షన్‌కు అర్హులు అవుతారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం రైతులు, విద్య, వైద్యం రంగాలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందడం లేదని అన్నారు. అనంతరం వైసిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులతో కలిసి సంతకాలు సేకరించిన 62వేల పైచిలుకు సంతకాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శకటంలో బాపట్ల పట్టణంలోని వైసిపి కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కౌతరపు పద్మావతి, పిచ్చయ్య శాస్త్రి, నాయకులు పడమటి శ్రీనివాసరావు, యల్లమంద, జోషికాంత్, కౌతరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పర్చూరు : వైద్య కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన కోటి సంతకాల సేకరణ పూర్తి చేసినట్లు వైసిపి ఇన్‌ఛార్జి గాదె మధుసూదనరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ సిఎం జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు వైద్య కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రజల నుండి సంతకాల సేకరణ చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 65,064 మంది ప్రజలు సంతకాలు చేసినట్లు తెలిపారు. పూర్తి చేసిన సంతకాల పత్రాలు వాహనాల్లో భద్రపరచి వాహనాల్లో జిల్లా కేంద్రమైన బాపట్లకు తరలించినట్లు తెలిపారు. బొమ్మలు సెంటర్లోని వైఎస్ఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. పర్చూరు, చీరాల పరిశీలకులు బసవపున్నారెడ్డి, మండల కన్వీనర్లు కటారి అప్పారావు, నాగేశ్వరరెడ్డి, పూర్ణరావు, రావూరి వేణుబాబు, జంపని వీరయ్య చౌదరి, యద్దనపూడి హరిప్రసాద్, ముప్పాళ్ళ రాఘవయ్య, కొల్లా శ్రీహరి, కంచనపల్లి రమేషు, మల్ల శ్రీనివాసరావు, లంక శివ, గోరంట్ల శివకుమారి, తులసి నాగమణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి ఇన్‌ఛార్జి గాదె మధుసూధనరెడ్డి

రూ.10 కోట్లతో రహదారుల అభివృద్ధి

ప్రజాశక్తి - బాపట్ల

ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి రూ.10 కోట్ల నిధులు మంజూరైనట్లు శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ బుధవారం తెలిపారు. పంచాయితీ రాజ్ గ్రామీణాభి వృద్ధి శాఖ ఆధ్వర్యంలో రహదారుల నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కర్లపాలెం మండలం నాగరాజుపాలెం రోడ్డుకు రూ.1.78 కోట్లు, పొన్నూరు, చందోలు, జడవల్లిని కలిపే రహదారి నిర్మాణానికి రూ.1.47కోట్లు, రేపల్లె, ఖాజీపాలెం ఆర్అండ్ బి రోడ్డు నుండి పరిశావారిపాలెం మీదుగా కొత్తపాలెం రోడ్డుకు రూ.1.27కోట్లు, తారకరామా ఎస్టీ కాలనీ నుండి కర్లపాలెం ఎంవి రాజుపాలెం రోడ్డుకు రూ.1.43కోట్లు, గణపవరం ఆర్అండ్ బి రోడ్డును కలుపుతూ కర్లపాలెం దండుబాట రోడ్డుకు రూ.99 లక్షలు, పెదగొల్లపాలెం నుండి నక్కలవారిపాలెం మీదుగా గణపవరం రోడ్డుకు రూ.60 లక్షలు, పెదపులుగువారి పాలెం ఆర్ అండ్ బి రోడ్డు నుండి మర్రికట్టవ జడ్పీ రోడ్డుకు రూ.42 లక్షలు, జాతీయ రహదారిని కలిపే కొండుభొట్ల పాలెం రోడ్డుకు రూ.11 లక్షలు, జాతీయ రహదారిని కలిపే సుబ్బారెడ్డి పాలెం రోడ్డుకు రూ.91లక్షలు, నర్సాయపాలెం నుండి పొలాల బాట రోడ్డుకు రూ.52 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్

జాబ్‌మేళాలో ఉద్యోగాలకు ఎంపిక

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజిలో ఎపి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9న నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 12 మంది కెఆర్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ వేటి ప్రసాద్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ప్రారంభ వేతనం నెలకు రూ.17వేలు ఉంటుందని తెలిపారు. విద్యార్థులను జెకెసి కో ఆర్డినేటర్ డాక్టర్ ఎన్ షర్మిలా రాణి, ప్లేసెమెంట్ ఆఫీసర్ ఎ సికామని, గంగాధర్, స్కిల్ కో ఆర్డినేటర్ ఎస్‌కె మస్తాన్‌వలి, జెకెసి మెంటార్ వినుకొండ రమేష్ అభినందించారు.

ఇరుక్కుపోయిన గ్రానైటు లోడు లారీ

ఇరుక్కుపోయిన లారీ

ప్రజాశక్తి - బల్లికురవ

బల్లికురవ, కొణిదెన రహదారిలో స్థానిక ఎత్తిపోతల పథకం సమీపంలో నూతన కల్వర్టు నిర్మాణ పనులు కొనసాగుతుండటంతో ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన రహదారిలో గ్రానైట్ పలకల లారీ బుధవారం ఇరుక్కుపోయింది. సాయంత్రం వరకు లారీని తొలగించకపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని నాగండ్లకు చెందిన మేకల అంజనా మంగళవారం అర్ధరాత్రి వీధి కుక్కలు గొర్రెలపై దాడి చేసి 8 గొర్రెలను చంపినట్లు ఆమె తెలిపారు. తనకు జీవనాధారమైన రూ.1.10లక్షల విలువైన గొర్రెలు మృతి చెందడంతో తీవ్ర వేదనకు గుర య్యారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు. గ్రామ సర్పంచ్ కంచుగంటి పద్మ సంఘటనా స్థలంలో పరిశీలించి పశు వైద్య అధికారులకు సమాచారం ఇచ్చారు. బాధితురాలు నిరుపేదని మాజీ జెడ్పిటిసి వీరగంధం ఆంజనేయులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

బాపట్ల జట్టుకు ఓవరాల్ ఛాంపియన్ షిప్

ప్రజాశక్తి - బాపట్ల

విజేతలైన విద్యార్థులతో అసోసియేట్ డీన్ ఇ ప్రసూనరాణి

అంతర్ వ్యవసాయ కళాశాలల క్రీడలు, సాహిత్య, సాంస్కృతిక పోటీల్లో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు రెండు విభాగాల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించినట్లు కళాశాల అసోసియేట్ డిన్ ఈ ప్రసూనరాణి తెలిపారు. క్రీడల్లో విజేతలైన విద్యార్థులకు కళాశాలలో బుధవారం అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తిరుపతిలో జరిగిన ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ అంతర కళాశాలల క్రీడలు, సాహిత్య, సాంస్కృతిక పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు సాంస్కృతిక, బాలికల క్రీడలు విభాగాలల్లో రెండు ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించినట్లు తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం స్థాయిలో 19 కళాశాలల విద్యార్థుల జట్టులు పాల్గొన్నట్లు తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు సాహిత్యం, హిందీ డిబేట్‌లో ప్రథమ బహుమతి, ఆశు వచనంలో తృతీయ బహుమతి, తెలుగు, ఇంగ్లీష్ వ్యాస రచన, క్విజ్ పోటీల్లో తృతీయ బహుమతులను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. సాంస్కృతిక విభాగంలో గ్రూప్ సాంగ్, సోలో క్లాసికల్ డాన్స్, నాటికల పోటీల్లో ప్రథమ, సోలో వాద్యం స్కిట్ పోటీలో ద్వితీయ, గ్రూఫ్ డాన్స్‌లో తృతీయ, కార్టూనింగ్, రంగోలి పోటీల్లో తృతీయ బహుమతులు పొందారని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో స్టూడెంట్ యాక్టివిటీస్ ఆఫీసర్ ఇంచార్జి ఎం శ్రీరేఖ పాల్గొన్నారు.

సాంకేతికత రంగంలోనూ ప్రతిభ చాటాలి

ప్రజాశక్తి - బల్లికురవ

మాట్లాడుతున్న తహశీల్దారు రవినాయక్

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఎంవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 10 కంప్యూటర్లను బహుకరించారు. తాము అందజేసిన కంప్యూటర్ల ద్వారా విద్యార్థులు ఎంత మేరకు సాంకేతిక నైపుణ్యం అందిపుచ్చుకున్నారనే అంశంపై కళాశాల విద్యార్థులకు నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 31 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. స్థానిక కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన సభలో తహశీల్దారు రవి నాయక్ మాట్లాడుతూ దాతలు అందజేస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కళాశాల విద్యార్థులు విద్యతో పాటు సాంకేతిక రంగంలోనూ నైపుణ్యం సాధించాలని అన్నారు. ఎంపిడిఒ కుసుమ కుమారి మాట్లాడుతూ కార్పొరేట్ కళాశాలకు దీటుగా ప్రభుత్వ కళాశాల్లో అందజేస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకుని జీవితాలు అత్యుత్తమంగా తీర్చిదిద్దుకోవాలని అన్నారు. ప్రిన్సిపాల్ సుధాకరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సహకారం మరువలేనిదని అన్నారు. కార్యక్రమంలో ఎంవి ఫౌండేషన్ కో ఆర్డినేటర్ హరిహరరెడ్డి, నెదర్లాండ్స్ టీం నీల్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి ఇన్వర్టర్ బహూకరణ

ప్రజాశక్తి - పర్చూరు

వృద్ధాశ్రమానికి ఇన్వర్టర్ బహుకరిస్తున్న దృశ్యం

మండలంలోని నాగులపాలెంలో నిర్వహిస్తున్న బృందావనం వృద్ధాశ్రమానికి ఇన్వర్టర్‌ను దాతలు బుధవారం బహుకరించారు. ఇంకొల్లుకు చెందిన తుమాటి సుబ్బారావు ధర్మపత్ని లక్ష్మీకాంతం జ్ఞాపకార్థం వారి కుమారుడు ఎన్ఆర్ఐ తుమాటి లక్ష్మణరావు, అరుణ దంపతులు ఇన్వర్టర్ అందజేసినట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. రూ.20వేల విలువైన ఇన్వర్టర్‌ను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులు, యాజమాన్యం దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

నివాళులర్పిస్తున్న నాయకులు, గ్రామస్థులు

వార్డు సభ్యులు ప్రకాశరావుకు నివాళి

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని తనుబొద్దివారిపాలెంకు చెందిన మేరుగా ప్రకాశరావు (80) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. మృతుడు గ్రామ వార్డు సభ్యునిగా పని చేశారు. ఆయన మృత దేహానికి మాజీ సర్పంచ్ జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, బహుజన నాయకులు నాగేశ్వరరావు నివాళులర్పించారు. వార్డు సభ్యుడుగా తన పదవి కాలంలో గ్రామంలో చేసిన అభివృద్ధిని గుర్తు చేసుకున్నారు. ప్రకాశారావు తన కుమారుల అభివృద్ధికి కష్టపడ్డారని అన్నారు. కుటుంబ ఉన్నతికి శ్రద్ధ చూపాడని అన్నారు. ఆయన చొరవతోనే మనవడు పరిశుద్ధరావు ఉగాండా దేశంలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడని చెప్పారు. విమానాల రద్దు కారణంగా అంత్యక్రియలకు హాజరు కాలేకపోయాడని తెలిపారు. తన తాతను చివరి చూపు కూడా చూచుకోలేక పోయాడని బంధువులు ఆవేదంగా వ్యక్తం చేశారు. మృతునికి భార్య జ్ఞానమ్మ, కుమారులు పరిశుద్ధరావు, వీరయ్య, కోడళ్ళు విజయమ్మ, దివ్య, కుమార్తెలు శేషమ్మ, ప్రమీల, మనుమలు పరిశుద్ధరావు, రాజేష్, లూదియా, శిరీష, బ్లేసి ఉన్నారు. ఎస్‌సిఆర్‌పి సొసైటీ పర్చూరు నియోజకవర్గ కన్వీనర్ రాము, పోతుకదాట్ల వార్డు సభ్యులు సుబ్బారావు, మూకిరి ఆగస్టు, వీరారెడ్డి, కోటిరెడ్డి, మెరుగ ఇశ్రాయేలు, మూకిరి విజయమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

మోడల్ టెస్ట్ పేపర్ అందజేత

ప్రజాశక్తి - అద్దంకి

సీనియర్ రొటేరియన్ పువ్వాడ రామ కోటేశ్వరరావు ఆర్థిక సౌజన్యంతో మండలంలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులు 140 మందికి రూ.15వేల విలువైన మోడల్ టెస్ట్ పేపర్ పుస్తకాలను బుధవారం రోటరీ ప్రతినిధులు అందించారు. హెచ్‌ఎం పెంట్యాల గంగాధరరావు, రోటరీ అధ్యక్షులు బాచిన శివధర పూర్ణచంద్రరావు, సెక్రటరీ అలహరి హరిప్రసాద్, ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు, రోటరీ బేసిక్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ అన్నంగి సుబ్బారావు, చప్పిడి వీరయ్య, గూడా లక్ష్మీరెడ్డి, చిన్ని కామేశ్వరరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ వైఫల్యం

ప్రజాశక్తి - వేమూరు

ప్రభుత్వ ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాన్ని దళారుల చేతుల్లోకి ఆర్బీకేలు, సొసైటీ వ్యవస్థలు జారిపోయాయి. పంట ఎంత బాగున్నా ధర, ధాన్యంలో అడ్డగోలుగా కోతలు విధిస్తున్నారు. దీని కారణంగా రైతులు కొనుగోలు కేంద్రాలను వదిలేసి ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో రైతులు 75 కిలోల బస్తాకు ఏకంగా రూ.400 వరకు ధర కోల్పోతున్నారు. దీని వలన ఎకరాకు రూ.10వేలకు పైగా రైతులు నష్టపోతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం లోడింగ్, మిల్లుకు చేర్చే బాధ్యత ప్రభుత్వం రైతుల పైనే వదిలేయడంతో రైతులు తీవ్రంగా నష్టాలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం డబ్బులు ఇవ్వట్లేదని రవాణాకు వాహన యజమానులు ముందుకు రావడం లేదని రైతుల వాపోతున్నారు. మిల్లులో తేమ శాతం పేరుతో మోసగిస్తున్నా ప్రభుత్వం వేడుక చూస్తున్న చందంగా మారింది. ఈ క్రాప్ నమోదులో అధికారుల నిర్లక్ష్యంతో కౌలు రైతులకు తీవ్ర అన్యాయం జరిగింది. నియోజక

రోడ్లపై ఆరపోసిన ధాన్యం

వర్గంలో ఈ ఏడాది రైతులు సాగుచేసిన 90 వేల ఎకరాల్లో వరి ధాన్యం పండించిన రైతులకు తీవ్ర నష్టాలు చూస్తున్నారు. ఈ ఏడాది నవంబర్ నెలలో సంభవించిన తుఫాను కారణంగా అప్పటికే వరి పైరు పాలు పోసుకునే దశలో ఉండటంతో గింజ పాలు పోసుకోకుండానే దెబ్బతిన్నది. దీంతో రైతులు ఆశించిన మేర దిగుబడులు రాక ఎకరాకు ఐదు నుండి పది బస్తాల వరకు తగ్గిపోయాయి. 35 నుండి 40 బస్తాలు పండుతాయని భావించిన రైతులకు తుపాను కారణంగా 20 నుండి 30 బస్తాల్లోపు మాత్రమే దిగబడు లభిస్తున్నాయి. దీనికి తోడు హార్వెస్టర్ల ద్వారా కోతలు కోసిన ధాన్యంలో తాలు గింజలు అధికంగా ఉండటంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ఇది నాణ్యత కోల్పోవడంతో మిల్లర్లు ధరలో కోత విధిస్తున్నారని రైతులు వాపోతున్నారు. అదీకాక ప్రభుత్వం నిర్దేశించిన తేమ శాతానికి తక్కువగానే ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు వెళుతుండగా అక్కడ తేమ శాతం అధికంగా ఉందని ఈ ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని మిల్లర్లు చెప్పడతో రైతులు ఏమి చేయాలో దిక్కుతోచక అల్లాడుతున్నారు. 70 శాతంపైగా సాగులో ఉన్న కౌలు రైతులకు తీవ్ర నష్టాలు వస్తున్నాయి. ముందుగానే కౌలు చెల్లించి రూ.వేలల్లో వెచ్చించి సాగుచేసిన పంటకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో ఖర్చులు కూడా దక్కటం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో నిబంధనం సడలించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

భూ సేకరణ చెల్లింపునకు నిధులు

ప్రజాశక్తి - అద్దంకి

నార్కెట్‌పల్లి, అద్దంకి, మేదరమెట్ల (నామ్) రోడ్డు విస్తరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. గత పదేళ్లుగా భూసేకరణకు అవసరమైన నిధులు మంజూరులో జాప్యం కారణంగా మండలంలోని చక్రాయపాలెం, గోపాలపురం గ్రామాలు, సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు గ్రామాల వద్ద రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయని తెలిపారు. ఈ అంశాన్ని పలు మార్లు సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలను కలిపే అత్యంత కీలకమైన రోడ్డులో ప్రమాదకర మలుపుల కారణంగా తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న విషయాన్ని వివరించామని తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని నామ్ రోడ్డు విస్తరణకు భూ సేకరణకు అవసరమైన నిధులు కేటాయించాలని సంబంధిత అధికారులకు సిఎం ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. రోడ్డు విస్తరణ భూసేకరణకు రూ.3.44 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మంత్రి పేర్కొన్నారు. రోడ్డు విస్తరణకు మంజూరైన నిధులు త్వరలోనే చక్రాయపాలెం, కలవకూరు, గోపాలపురం, ఏల్చూరు గ్రామాల పరిధిలో భూసేకరణ నిమిత్తం రైతులకు చెల్లించి, రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయనున్నట్లు తెలిపారు.

విజన్ బిల్డింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి - అద్దంకి

మండల సమాఖ్యలోని ఈసీ సభ్యులకు విజన్ బిల్డింగ్‌పై బుధవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం జ్యోతి ప్రసాద్ బాబు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతం చెందాలంటే గ్రూపు, గ్రామ సంఘం పటిష్టంగా ఉండాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకొని ఆదర్శ వంతమైన గ్రూపులుగా తయారు కావాలని కోరారు. గ్రామంలో పని చేసే పాలకవర్గ సభ్యులు ఇతర సభ్యులకు ఆదర్శంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఎల్‌సి కోరే విజయ భాస్కర్, సీసీలు విజయరాణి, బ్రహ్మయ్య, వెంకయ్య, యేసు, మండల సమాఖ్య ప్రతినిధులు షేక్ కరిమూన్, పచ్చవ భారతి, అంజమ్మ, మాలతి, శ్యామల పాల్గొన్నారు.

రోడ్డు నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని సూరవరపుపల్లి, అనంతవరం, వింజనంపాడు, శ్యామలవారిపాలెం, మున్నంగివారిపాలెం గ్రామాల్లో నూతన నిర్మించిన సిసి రోడ్లు, డ్రైనేజీ పనుల నాణ్యతను క్వాలిటి కంట్రోల్ టీం బుధవారం పరిశీలించారు. క్వాలిటీ కంట్రోల్ డిఇ శ్యాంప్రసాద్ సిబ్బందికి సూచనలు చేశారు. కొన్నిచోట్ల సిసి రోడ్ల నిర్మాణంలో హెచ్చు తగ్గులు ఉన్నాయని, డ్రైనేజీ కాలవల్లో కొన్నిచోట్ల నీళ్ళు పారే వాలు తక్కువగా ఉందని, వాటిని సంబంధిత గుత్తేదార్లతో సరి చేయాలని సూచించారు. ఇంకా ఏమైనా తేడాలున్నా వాటిని సరి చేయించాలని ఇంజనీరింగ్, సచివాలయ సిబ్బందికి చెప్పారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోలు ఎఇ శ్రీనివాసరావు, పిఆర్ ఎఇ ఆనంద్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు యశ్వంత్ పాల్గొన్నారు.

మానవ హక్కుల రక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - రేపల్లె

మానవ హక్కుల పరిరక్షణ బాధ్యత అందరిపైన ఉందని న్యాయ అధికార సంస్థ పారా లీగల్ వాలంటీర్ చెన్ను నాగమల్లేశ్వరరావు అన్నారు. రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ పిలుపు మేరకు మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని శారద ఐటిఐ కళాశాల్లో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం బుధవారం నిర్వహించారు. కళాశాల సెక్రటరీ బడుగు వెంకట నారాయణ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ గౌరవించుకోవాలని అన్నారు. అప్పుడే మానవ హక్కుల దినోత్సవానికున్న ప్రాధాన్యత మరింత పటిష్టంగా

మాట్లాడుతున్న చెన్ను నాగమల్లేశ్వరరావు

ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్మెంట్ అధికారి మంద్రు ప్రసాద్, పారా లీగల్ వాలంటీర్ ఆర్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ శారద, జ్యోత్స్న పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

ప్రజాశక్తి - పంగులూరు

భూసార పరీక్షల ఆధారంగా రైతులు ఎరువులు వాడవాలని, తద్వారా ఎరువులపై అధిక ఖర్చులు తగ్గించుకోవచ్చని ఎఒ డి సుబ్బారెడ్డి కోరారు. మండలంలోని రామకూరు, భగవాన్ రాజుపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది బుధవారం నిర్వహించారు. సమగ్ర యాజమాన్య పద్ధతులు ఉపయోగించుటంతో భూసారం పెరుగుతుందని వివరించినారు. పంట అవశేషాలు కాల్చకుండా ఉండాలని రైతులను కోరారు. సదస్సులో విఎఎ హరిబాబు పాల్గొన్నారు.

అద్దంకి : నానో యూరియాతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన అధికారిణి ఎస్ దీప్తి సూచించారు. కోటికలపూడి, కుంకుపాడు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మొక్కజొన్న సాగు చేసిన రైతులు

మాట్లాడుతున్న పంగులూరు ఎఒ సుబ్బారెడ్డి

తప్పని సరిగా యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా ఎకరాకు 500 ఎంఎల్ వాడుకోవచ్చని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం అమ్ముకోవచ్చని చెప్పారు. క్వింటాల్ గ్రేడ్ ఎ రకం రూ.2389 మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ కోటేశ్వరరావు, విఎఎ సుకన్య పాల్గొన్నారు.

యాప్‌తో డ్వాక్రా గ్రూపులు బలోపేతం

ప్రజాశక్తి - బాపట్ల

యాప్ వినియోగంతో స్వయం సహాయక సంఘాలు మరింత పురోగతికి దోహదపడుతుందని డిఆర్డిఎ పిడి లవన్న అన్నారు. వెలుగు, డిఆర్డిఏ ఆధ్వర్యంలో మండల సమాఖ్య కార్యాలయంలో కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల గ్రామ సంఘం అసిస్టెంట్లకు 'మన డబ్బులు, మన లెక్కలు' అనే అంశంపై ఏర్పాటు చేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల్లో ప్రతి మహిళ దాచుకున్న పొదుపు రుణాల చెల్లింపు నగదు, మిగులుదల వివరాలు యాప్ ద్వారా తెలుసుకునే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ యాప్ వినియోగంతో ప్రతి గ్రామ సంఘం అసిస్టెంట్ పరిధిలో పారదర్శకంగా, అవినీతికి పాల్పడకుండా పనిచేయాలని సూచించారు. ప్రతి మహిళను వ్యాపారవేత్తగా ఎదిగే తరహాలో అవగాహన కల్పించి యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన అవగాహన యాప్ ద్వారా కల్పించాలని అన్నారు. డిపిఎం యు సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి మహిళను వ్యాపారవేత్తగా తయారు చేయాలనే

మాట్లాడుతున్న డిఆర్డిఎ పిడి లవన్న

ఉద్దేశంతో ముందుకు వెళుతుందన్నారు. అందుకు తగ్గట్టు గ్రామ సంఘం అసిస్టెంట్లు పనిచేయాలని అన్నారు. డిపిఎం కె రవికుమార్ మాట్లాడుతూ 'మన డబ్బులు, మన లెక్కలు' యాప్‌ను ప్రతి మహిళకు తెలియజేసి వారికి సంబంధించిన పొదుపులు, అప్పులు తెలుసుకోవడమే గాక ప్రభుత్వం చేపడుతున్న పథకాలను తెలుసుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఎపిఎంలు చిన్నయ్య, శ్రీనివాసరావు, సురేష్, సీసీలు, కర్లపాలెం, పిట్టలవానిపాలెం గ్రామ సంఘం అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పిస్తున్న బార్ అధ్యక్షులు

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - పర్చూరు

విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బార్ అధ్యక్షుడు జాన్ బాబు తెలిపారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భం స్థానిక బిఆర్ అండ్ టిఎ ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మానవ హక్కులకు భంగం కలిగినప్పుడు న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని చెప్పారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండి జీవనం సాగించాలని కోరారు. మానవ హక్కుల పరిరక్షణకు చట్టాలున్నాయని అన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు క్రమశిక్షణతో విద్య అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఎం రవీంద్రనాథ్‌రెడ్డి, బార్ కార్యదర్శులు షేక్ రుక్సానా, కాసా అశోక్ కుమార్, ప్రిన్సిపల్ శేషు కుమారి పాల్గొన్నారు.

ఎగ్జిక్యూటివ్ సభ్యులకు శిక్షణ

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామ ఎగ్జిక్యూటివ్ సభ్యుల శిక్షణ బుధవారం రెండో రోజు నిర్వహించారు. శిక్షణలో ఎపిఎం రామకృష్ణ మాట్లాడుతూ మోడల్ మండలంగా తీర్చిదిద్దడానికి గ్రామ ఎగ్జిక్యూటివ్ సభ్యుల పాత్ర ముఖ్యమని తెలిపారు. గత కొన్నేళ్ల నుండి పేదరికం అంటే ఏమిటి, అందుకు సంబంధించిన కారణాలు, పేదరికం నుండి బయట పడాలంటే ఏమి చేయాలనే అంశాలపై వివరించారు. ముందుగా గ్రూపులుగా తయారు చేసి చార్టుల ద్వారా ప్రెజెంటేషన్ ఇచ్చారు. సభ్యులు గ్రూపుల్లోకి రాక ముందు, గ్రూపులోకి వచ్చిన తర్వాత సంతోషాలను అందరూ సభ్యులతో చర్చించారు. ఒకరితో ఒకరు అనుభవాలు పంచుకున్నారు. కార్యక్రమంలో సీసీలు విజయ్ కుమార్, శ్రీనివాసమూర్తి, నరసింహారావు, అకౌంటెంట్ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

12న రక్షణ సేవ పెన్షనర్లకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - బాపట్ల

రక్షణ సేవ పౌర పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లకు (స్పర్శ్) సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారానికి రక్షణ సేవ పెన్షనర్లకు అవగాహన కల్పిస్తున్నట్లు సైనిక సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి ఆర్ గుణశీల

మాట్లాడుతున్న గుణశీల

బుధవారం తెలిపారు. ఈ నెల 12న కొత్త ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో టిటిడి కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్ సిడిఎ ఆధ్వర్యంలో సిస్టం ఫర్ పెన్షన్ అడ్మినిస్ట్రేషన్ రక్ష స్పర్శ్‌పై అవగాహన కల్పిస్తారని తెలిపారు. రక్షణ సేవ, రక్షణ పౌర పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లకు (స్పర్శ్) సంబంధించిన ఫిర్యాదులు, ప్రశ్నలకు రక్షణ ఖాతాల విభాగం అధికారులు హాజరై పరిష్కారం చూపుతారని అన్నారు. రక్షణ పెన్షనర్లు మాన్యువల్, డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించవచ్చని అన్నారు. ఆర్మీ నుండి ఎఓసి, ఈఎంఈ రికార్డులకు సంబంధిత అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. అవగాహన సదస్సుకు గుంటూరు, బాపట్ల, పలనాడు జిల్లాల రక్షణ శాఖ పెన్షనర్లు తమ ఒరిజినల్ మిలటరీ డిశ్చార్జ్ సర్టిఫికెట్లు, పెన్షన్ పేమెంటు ఆర్డర్, పెన్షన్ పాస్ బుక్, ఆధార్ కార్డు, పాన్ కార్డు, కుటుంబ సభ్యుల వివరాలు తమ పెన్షన్‌కు లింక్ చేయబడిన మొబైల్ తీసుకొని రావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ సందేహాలు నివృత్తి చేసుకోవడానికి, తమ ఫిర్యాదులు పరిష్కరం చేసుకోవచ్చని తెలిపారు. ఇతర సమాచారం కోసం 0863 2225853, 86888 17827 నెంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

సమ్మె హక్కును అడ్డుకోవడం తగదు

ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

అంగన్వాడీల సమ్మె హక్కును అధికారులు అడ్డుకోవడం తగదని ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఆ మేరకు యూనియన్ నేతలు బుధవారం నాడు ఒక ప్రకటన విడుదల చేశారు. అంగన్వాడీ కేంద్రాల సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డిసెంబర్ 12న కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమం తలపెట్టగా, కార్యక్రమాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ అదే రోజు ప్రాజెక్ట్ మీటింగ్ నిర్వహించేందుకు ఆదేశాలు ఇవ్వడం పట్ల నాయకులు ఆక్షేపణ వ్యక్తం చేశారు. ఈ విషయం నాయకులు వినతిపత్రం ఇచ్చే ప్రయత్నం చేసినప్పటికి ధర్నా నోటీసును స్వీకరించకపోవడంతో నోటీసును ఆఫీసులోని టపాల్లో వేసి.. బయటికి రావాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు వారు పేర్కొన్నారు. దీంతో కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి డిఆర్ఒ బి చిన ఓబులేసుకు వినతిపత్రం అందజేశారు. 12వ తేదీ న ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఏర్పాటు చేసిన ప్రాజెక్ట్ మీటింగ్‌ను వాయిదా వేయాలని వారు డిఆర్‌ఒకు విజ్ఞప్తి చేశారు. డిఆర్‌ఒను కలిసిన వారిలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ, సిఐటియు జిల్లా కోశాధికారి పి.శ్రీనివాసరావు ఉన్నారు.

వైద్య కళాశాలలను

ప్రైవేటీకరించే కుట్రను అడ్డుకుంటాం..

వైసిపి నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రాష్ట్ర ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరించే కుట్రను అడ్డుకునేందుకు చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఉద్యమం ఒంగోలు నగరంలో ఉప్పెనలా సాగిందని ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు తెలిపారు. ప్రజలు, విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సంతకాలు చేయడం ఈ పోరాటానికి ప్రజల్లో ఉన్న మద్దతుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. బుధవారం నియోజకవర్గ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించిన ఆయన కొత్తపట్నం, ఒంగోలు రూరల్ మండలాలు, నగరంలోని 46 డివిజన్లలో మొత్తం 62 వేల సంతకాలు సేకరించామని వివరించారు. అనంతరం సంతకాల ప్రతులతో నిండిన బాక్సులను ప్రత్యేక వాహనంలో చుండూరి రవిబాబు, పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఇతర నాయకులు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ అనంతరం సంతకాల బాక్సులను వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయానికి అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసిన మెడికల్ కళాశాలలను చంద్రబాబు ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా ప్రైవేటీకరణ చేయాలని యత్నించడం తీవ్ర అన్యాయమన్నారు. వైద్యం, వైద్య విద్య పేదలకు అందకుండా చేసే నిర్ణయాన్ని ప్రజలు తిరస్కరిస్తున్నట్లు తెలిపారు. అందుకే పెద్ద ఎత్తున ముందుకొచ్చి సంతకాలు చేసి తమ ఆందోళన వ్యక్తం చేశారని స్పష్టం చేశారు. ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఒక ప్రజా ఉద్యమంగా మారింది. చుండూరి రవిబాబు ఆధ్వర్యంలో ఒంగోలు నియోజకవర్గంలోనే 62 వేల సంతకాలు అందాయన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించకుండా కాపాడేందుకు వైఎస్సార్‌సీపీ బలంగా పోరాడుతుందని అన్నారు. కార్యక్రమంలో పరిశీలకులు వై. వెంకటేశ్వరరావు, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, కొత్తపట్నం మండల అధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి, ఒంగోలు మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు, పలువురు నాయకులు, గ్రామ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలి

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

టిడ్కో ఇళ్ల నిర్మాణం వెంటనే పున్నప్రారంభించి టిడ్కో ఇళ్ల నిర్మాణం వెంటనే పున: ప్రారంభించి లబ్ధిదారులకు అందించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఆ మేరకు ఆ పార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు బుధవారం నాడు ఒక ప్రకటన విడుదల చేశారు. ఒంగోలు నగర పరిధిలోని చింతల, కొప్పోలు ప్రాంతాల్లో 2018లో అప్పటి తెలుగు దేశం ప్రభుత్వం టిడ్కో ద్వారా ప్రారంభించిన 300, 365, 430 చదరపు అడుగుల విస్తీర్ణం గల ఫ్లాట్ ఒక్క రూపాయికి అందజేస్తామన్న హామీ అమలు చేయక పోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైనవారంతా దళి తులు, గిరిజనులు, బలహీన వర్గాలకు చెందిన పేద కూలీలు అని, వారికి సొంతింటి కల నెర వేరుతుందన్న ఆశలను ప్రభుత్వాలు వరుసగా దగా చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత నిర్మాణాలకు అవసరమైన నిధులు కేటాయించకపోవడంతో పనులు పూర్తిగా ఆగిపోయాయన్నారు. 2024 ఎన్నికల్లో హామీ ఇచ్చి తిరిగి అధికారం లోకి వచ్చిన కూటమి కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించేందుకు కసరత్తు చేస్తున్నప్పటికీ, బ్యాంకుల ద్వారా డబ్బులు పొందిన కొద్దిపాటి బ్లాకుల వద్ద మాత్రమే పనులు మొదలయ్యాయని తెలిపారు. కొప్పోలు వద్ద 144, చింతల వద్ద 192మొత్తం 336 ఇళ్ల బ్లాకులు ఇప్పటికీ నిర్మాణం ప్రారంభం కాకపోవడం అత్యంత విచారకరమని శ్రీనివాసరావు అన్నారు. కాంట్రాక్టర్లకు పాత బకాయిలు చెల్లించకపోవడంతో వారు పనులు చేపట్టడంలేదని, ఈ పరిస్థితిలో ఇళ్లను రద్దు చేస్తారేమోనన్న భయంతో లబ్ధిదారులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు.నగరంలో 6000 మందిని మొదట అర్హులుగా గుర్తించగా, గత ప్రభుత్వం 1872 మందిని తొలగించి 4128 మందిని మాత్రమే అర్హులిగా ప్రకటించిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం మరో 336 మందిని తొలగించి కేవలం 3792 మందికి మాత్రమే ఇళ్ల నిర్మాణం చేపట్టడం పేదలకు జరుగుతున్న ఘోర అన్యాయమని ఆరోపించారు.. పెండింగ్ లోని 336 ఇళ్ల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించి, అర్హులైన వారందరికీ ఇళ్లను పూర్తి చేసి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

తుపాన్ సమయంలో సేవలందించిన

మున్సిపల్ సిబ్బందికి సన్మానం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మున్సిపల్ సిబ్బందిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్

మొంథా తుపాను సమయములో ఒంగోలు నగరపాలక సంస్థ తరపున విశేష సేవలు అందించిన సుమారు 230 మందికి (శానిటరీ వర్కర్స్ 100 మంది, ఇంజనీరింగ్ వర్కర్స్ 33 మంది, సచివాలయ సిబ్బంది 82 మంది, ఆఫీస్ సిబ్బంది 25 మందికి) బుధవారం స్థానిక బాలాజీ తిరుపతి రావు కల్యాణమండపంలో సన్మాన కార్యక్రమం జరిగింది. ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన రావు మాట్లాడారు. మొంథా తుఫాను సమయంలో మీరు చేసిన పనుల వల్లే తాను గానీ, కమిషనర్ గానీ మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకోగలిగామని అన్నారు. కార్మికుల యొక్క సంక్షేమం కోసం ఇక మీదట ప్రతి మూడు నెలలకు ఒకసారి హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. రాబోయే జనవరి నుంచి ప్రతి మూడు నెలలకు వర్కర్స్ యొక్క పనితీరు రివ్యూ చేసి ప్రతి శానిటరీ డివిజన్ నుంచి ఇద్దరు శానిటరీ వర్కర్లకు ఒక నెల జీతం బోనస్ కూడా ఇవ్వటం జరుగుతోందని తెలిపారు. శానిటరీ వర్కర్స్ పనిచేస్తున్నప్పుడు వారికి గ్లోవ్స్, బూట్లు ఇవ్వమని నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు.

కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మొంథా తుపాను సమయంలో నగరపాలక సంస్థ సిబ్బంది ముఖ్యంగా శానిటరీ వర్కర్స్ మరియు సచివాలయ సిబ్బంది వారి కుటుంబాలని సైతం లెక్కచేయకుండా విపత్కర పరిస్థితిలో సేవలందించారని చెప్పారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వారికి చిరుసత్కారంతో పాటు ప్రశంసాపత్రం, నగరపలక సంస్థ తరుపున విశేష సేవ అందించిన 150 మంది వర్కర్స్‌కి నిత్యావసర వస్తువలను ఎమ్మెల్యే అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ కూడా అదే నిబద్ధత పని చేసి మన ఒంగోలు నగరాన్ని క్లీన్ ఒంగోలు గ్రీన్ ఒంగోలు నగరంగా రూపొందించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఒడా చైర్మన్ షేక్ రియాజ్ , నగర మేయర్ గంగాడ సుజాత, అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ (బుజ్జి), కార్పొరేటర్లు రవితేజ, అంబూరి శ్రీనివాస్, చింతపల్లి గోపి, శేషయ్య, పసుపులేటి శ్రీనివాస రావు, నరసయ్య, అంబటి ప్రసాద్, చంద్ర, నగరపాలక సంస్థ సిబ్బంది మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రొయ్యల పరిశ్రమలోని

మహిళల కోసం సంక్షేమ పథకాలు

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రొయ్యల పరిశ్రమలలో పనిచేస్తున్న మహిళల సంక్షేమం, భద్రత కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. రొయ్యల సిన్నర్జీ ప్రాజెక్టులో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాల కోసం మత్స్య, కార్మిక శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ప్రచార యాత్ర వాహనాన్ని జిల్లా కలెక్టర్ బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. అవగాహన కార్యక్రమాలపై రూపొందించిన గోడపత్రాలను కలెక్టర్ విడుదల చేశారు. ప్రచార కార్యక్రమాలను విస్తతంగా నిర్వహించాలని సూచించారు. రొయ్యల పరిశ్రమలలో మహిళల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ చెప్పారు. బాపట్ల జిల్లా తీర ప్రాంతంలో రొయ్యల పరిశ్రమలు అధికంగా ఉన్నందున వారి హక్కులపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ సమగ్ర సామాజిక భద్రత పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. అవగాహనతోనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఇ-శ్రమ పోర్టల్, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి శ్రమ యోగి మాన్ ధన్, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన, ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకాల గురించి మహిళలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ డిడి గాలి దేముడు, ఏడీ కృష్ణ కిషోర్, డిప్యూటీ చీఫ్ ఫ్యాక్టరీస్ ఇన్స్పెక్టర్ త్రినాధ్ రావు, సార్డ్ డైరెక్టర్ సునీల్ కుమార్, కార్మికశాఖ సహాయ అధికారి సాయి జ్యోతి, రవి ప్రదీప్, కళాకారులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ

పోలీసు పనితీరుపై ఐజి సమీక్ష

ప్రజాశక్తి-శింగరాయకొండ

పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఐజి త్రిపాఠి

నేరాలు నియంత్రణ,లా అండ్ ఆర్డర్ పరిస్థితులు, కీలక కేసుల పురోగతి, గంజాయి రవాణా/విక్రయం నియంత్రణ, క్రైమ్ మేనేజ్ మెంట్ వంటి పలు అంశాలపై గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజుతో కలిసి సింగరాయ కొండ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. సమావేశంలో జిల్లాలో నమోదైన కేసుల వివరాలను ఐజి సమీక్షించి, వాటి ప్రస్తుత స్థితిగతులపై సమగ్రంగా ఆరాతీశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా నేరాలు జరిగే ప్రాంతాలను గుర్తించారు. ఆ ప్రాంతాల్లో పెట్రోలింగ్, గస్తీ నిర్వహణను మరింత బలోపేతం చేసి నేరాల నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. నేర దర్యాప్తుల్లో వత్తి నైపుణ్యం మరియు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ముద్దాయిలను గుర్తించి అరెస్ట్ చేయాలన్నారు. ప్రజా భద్రతను అత్యంత ప్రాధాన్యతగా భావించి, కేసులు తగ్గించుటకు మరింత చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కీలక కేసుల విచారణను వేగవంతం చేయాలన్నారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టి, పాత నేరస్థులు–రిపీటెడ్ అఫెండర్లపై నిఘా ఉంచి, పెట్టి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ప్రమాద ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, స్పీడ్ చెకింగ్, వాహన తనిఖీలు, బారికేడ్లు, రిఫ్లెక్టివ్ డ్రమ్ములు ఏర్పాటు చేయాలని, డ్రంకన్ డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఐజీ ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌ను సందర్శించే బాధితులకు ధైర్యం, నమ్మకాన్ని కల్పించే విధంగా ప్రతి కేసును పోలీస్ అధికారులు, సిబ్బంది సున్నితంగా వ్యవహరించాలని ఐజి సూచించారు. సమావేశంలో ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, దర్శి డిఎస్పీ లక్ష్మీనారాయణ, కనిగిరి డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, సిఐలు హజరత్తయ్య, నాగరాజు, రామారావు, ప్రసాద్, రాజేష్ కుమార్ మరియు ఎస్సైలు పాల్గొన్నారు.

మార్టూరు పోలీస్‌స్టేషన్ తనిఖీ

మార్టూరు: మార్టూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ బుధవారం ఆకస్మికం గా తనిఖీ చేశారు. పోలీస్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐజి మాట్లా డారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగ కుండా తీసుకోవాల్సిన చర్యల గురించి, కీలక కేసుల్లో దర్యాప్తు వేగం పెంచి నిష్పక్షపాత వైఖరి పాటించి సర్కిల్ పరిధిలో నేరాలు నియం త్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల న్నారు. కార్యక్రమంలో బాపట్ల డిఎస్పి రామాంజనేయులు, మార్టూరు సీఐ మాదినేని శేషగిరిరావు డివిజన్ పరిధిలోని ఎస్ఐలు సిఐలు పాల్గొన్నారు.